

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

- మహిళా అధ్యాపకుల వేధింపులే కారణమంటున్న కుటుంబసభ్యులు
- న్యాయం చేయాలంటూ కళాశాల ప్రాంగణంలో ఏబీవీపీ నిరసన



సాయితేజ (ఫైల్ ఫొటో)

... మెయిన్‌లో

నేతల మేత

ముడుపు చెల్లిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్

- 'సార్‌తో ఓ మాట చెప్పించండి'... అంటున్న నగర పాలక సంస్థ అధికారులు
- గగ్గోలు పెడుతున్న భవన నిర్మాణదారులు
- కొన్ని నియోజకవర్గాల్లో తెర వెనుక చక్రం తిప్పుతున్న నాయకులు





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో భవన నిర్మాణం ఇప్పుడు కత్తి మీద సాములా మారింది. పెరిగిన నిర్మాణ వ్యయం సంగతి పక్కన పెడితే అనుమతుల పేరుతో వేధింపులు అధికమయ్యాయి. మొన్నటివరకు టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రమే చుక్కలు చూపించేది. ఇప్పుడు వారికి చాలామంది తోడయ్యారు. తోడేళ్లులా పీక్కు తింటున్నారు. ఇప్పుడు ఈ దందాకు నాయకులే వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. నాయకులు ఇలాంటి ఇబ్బందులు సృష్టిస్తారని అసలు ఊహించలేదని భవన నిర్మాణదారులు వాపోతున్నారు.

వంద గజాలలోపు నిర్మాణాలకు ప్లాన్ అవసరం లేదని, ఇల్లు కట్టుకునే వారిని వేధించవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దాంతో ఇప్పుడు అంతకు మించి నిర్మాణాలు చేపట్టేవారిపై పడుతున్నారు. వార్డులో సచివాలయ సిబ్బంది నుంచి జోనల్ ఆఫీసులో అధికారి వరకూ భవన నిర్మాణాలపై ఆదాయం కోసం ఎగబడుతున్నారు. ప్లాన్‌కు ఒకంతట అనుమతి ఇవ్వడం లేదు. గడువు ముగిసిన తరువాత 'డీమ్డ్ టు బి అప్రూవుడ్'గా భావించి నిర్మాణం చేపడితే దానిపై కొర్రీల మీద కొర్రీలు వేస్తున్నారు. భవన నిర్మాణాలే వృత్తిగా చేసుకున్న బిల్డర్లు ఎవరికి ఏమి ఇవ్వాలో అది ఇచ్చి పనులు పూర్తి చేసుకుంటున్నారు. అధికారులు, నాయకులకు ఇచ్చే లంచాలను కూడా వారు ఓ ఖర్చులా భావిస్తున్నారు. వీరు కాకుండా జీవితాంతం పొదుపు చేసి, వారసత్వంగా వచ్చిన భూమిలో కాసింత పెద్ద భవనం నిర్మించుకునేవారికే సమస్యలు ఎదురవుతున్నాయి. నిర్మాణానికి బోరు తవ్విన దగ్గర నుంచి ఫిర్యాదులు, బెదిరింపులు. టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఇవ్వాల్సింది ఇచ్చేసిన తరువాత... ప్రెస్ పేరుతో మరికొందరు. ఆ తరువాత స్థానిక కార్పొరేటర్ వాటా అంటూ కబురు... ఇలా అందరిని సంతృప్తి పరిచి నిర్మాణం పూర్తి చేసుకుని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం వెళితే..'సార్‌తో ఓ మాట చెప్పించండి'... అంటూ అధికారులు అసలు బాంబు పేలుస్తున్నారు. ఆ సార్ ఎవరో కాదు...నియోజకవర్గ నాయకుడే. వారి ఆఫీసుకు వెళ్లి, అక్కడి మనుషులను కలిస్తే నిర్మాణం స్థాయిని బట్టి 'ముడుపు' ఎంత చెల్లించుకోవాలో సెలవిస్తున్నారు. ఆ మొత్తం సమర్పించుకున్నాక జోనల్ ఆఫీస్‌కు వారి ముందే ఫోన్ చేసి...'మన వాళ్లే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేయండి' అని చెబుతున్నారు. అప్పుడు గానీ ఆ కొత్త భవనంలోకి గృహప్రవేశం చేయడం కుదరడం లేదు. జీవీఎంసీ పరిధిలో దాదాపు అన్ని నియోజకవర్గాల్లోను ఇదే పరిస్థితి ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నియోజకవర్గ నాయకుడికి తెలియకుండా ద్వితీయ శ్రేణి నాయకులు ఈ దందా చేస్తుంటే...మరికొన్ని నియోజకవర్గాల్లో నాయకులే తమ వారితో ఈ కలెక్షన్లు చేయిస్తున్నారు. బాగా తెలిసిన నాయకులే ఇలా ఇబ్బంది పెడుతున్నారేమిటి?... అని వ్యాపార వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి.

తూర్పు నౌకాదళం చీఫ్‌గా సంజయ్ భల్లా



పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్‌తో నూతన దళాధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా (కుడి వైపున ఉన్న వ్యక్తి)

- వార్త మెయిన్ ఎడిషన్‌లో...

ఆస్పత్రుల సమ్మె విరమణ

- యథావిధిగా ఎన్టీఆర్ వైద్య సేవలు

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):

ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలోని నెట్‌వర్క్ ఆస్పత్రులు శుక్రవారం సమ్మె విరమించాయి. బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో గల 35కు పైగా ఆస్పత్రులు అక్టోబరు పదో తేదీ నుంచి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అత్యవసరం మినహా అన్నీ సేవ లను నిలిపివేశాయి. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో శుక్రవారం చర్చలు జరిపింది. బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో పాటు తక్షణమే రూ.250 కోట్లు ... మిగతా 6వ పేజీలో

సబ్సిడీ రుణాలేవీ?

బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ద్వారా మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కూటమి ప్రభుత్వం

ఈ ఏడాది ఏప్రిల్‌లో దరఖాస్తుల స్వీకరణ

- చివరి దశలో బ్రేక్
- యూనిట్ల సంఖ్యను పెంచాలనే యోచనతోనే అంటున్న అధికారులు
- ఐదు నెలల కిందట నిలిచిపోయిన ప్రక్రియ..
- ఇప్పటివరకూ ముందుకు కదలని వైనం



బీసీ సంక్షేమ భవనం

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):

నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు చేపట్టిన ప్రక్రియ ముందుకుసాగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా వివిధ కులాలకు చెందిన నిరుద్యోగులకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఆయా కార్పొరేషన్లకు నిధులు కేటాయించింది. యూనిట్లను మంజూరు చేసేందుకుగాను దరఖాస్తులు స్వీకరించాలని సూచించింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు మార్చి నుంచి ఏప్రిల్ వరకు దరఖాస్తులను స్వీకరించారు. మే నెలలో దరఖాస్తుల పరిశీలన పూర్తిచేశారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు అయితే అర్హుల జాబితాలను బ్యాంకులకు పంపించారు. కొద్దిరోజుల్లో వారికి రుణాలు మంజూరవుతాయనుకునే సమయానికి (జూన్ నెలలో) ఈ ప్రక్రియను నిలిపివేయాలంటూ ప్రభుత్వం ఆదేశించింది.

జిల్లాలకు కేటాయించిన యూనిట్ల సంఖ్యను పెంచాలనే ఒత్తిడి రావడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని, దీనివల్ల అర్హులైనవారు వేలాది మంది ఉన్నారని, వారికి మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని సీఎంను పలువురు ఎమ్మెల్యేలు కోరారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఆయన...మరిన్ని యూనిట్లను మంజూరు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం నుంచి ఆయా శాఖలకు సమాచారం కూడా వచ్చింది. యూనిట్ల సంఖ్య పెరుగుతుండడంతో మరింత మందికి అవకాశం లభిస్తుందని అంతా భావించారు. దరఖాస్తుదారులు కూడా ఆనందం వ్యక్తంచేశారు. అయితే, ఈ ప్రక్రియ నిలిచిపోయి సుమారు ఐదు నెలలు కావస్తున్నా, ఇప్పటికీ తదుపరి ఆదేశాలు రాలేదు. దరఖాస్తుదారుల నుంచి ప్రతిరోజూ ఫోన్లు వస్తున్నాయని, కొందరు కార్యాలయానికి వచ్చి ఎప్పటిలోగా రుణాలు మంజూరవుతాయో చెప్పాలని అడుగుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

భారీగా దరఖాస్తులు

రుణాల కోసం జిల్లాలో బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని బీసీ, ఈబీసీ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లకు 2,368 యూనిట్లను కేటాయించారు. ఆ యూనిట్లకు 18,984 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్‌కు 406 యూనిట్లు మంజూరుచేయగా, సుమారు తొమ్మిది వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కేటాయించిన యూనిట్లకు రూ.16.88 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో రూ.6.68 కోట్లు సబ్సిడీగా అందించనుండగా, బ్యాంకులు రూ.9.35 కోట్లు రుణంగా ఇవ్వనున్నాయి.

దెబ్బతిన్న రహదారులు

- గ్రామాలపై తుఫాన్ ప్రభావం
- కాలనీల్లోకి నీరు



పెందుర్తి మండలం రాజయ్యపేటలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):

మొంథా తీవ్ర తుఫాన్ జిల్లాలోని పలు గ్రామాలపై ప్రభావం చూపింది. గ్రామ శివార్లలో కొత్తగా వెలసిన కాలనీల్లోకి నీరు చేరింది. నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 79 గ్రామ పంచాయతీలు ఉండగా, పలుచోట్ల రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండుచోట్ల పూర్తిగా ... మిగతా 6వ పేజీలో

అరకు, పాడేరు బస్సుల పునరుద్ధరణ

ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):

అరకులోయ, పాడేరు రూట్లలో బస్సులను ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. తుఫాన్ కారణంగా ఈ రెండు రూట్‌లలో బస్సులను సోమవారం నుంచి రద్దు చేసిన విషయం తెలిసిందే. వర్షాలు తగ్గడంతో గురువారం ఆర్టీసీ అధికారులు, సివిల్ ఇంజనీర్లు ఆ రూట్‌లలో సర్వే నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు లేవని నిర్ధారించుకుని శుక్రవారం బస్సులను ఆపరేట్ చేయడం ప్రారంభించారు. తుఫాన్‌కు ముందు ఈ రెండు రెండు రూట్‌లలోను ప్రతిరోజూ 20 షెడ్యూల్స్ నడిచాయి. శుక్రవారం పది సర్వీసులు నడిపారు. శనివారం మరో పది సర్వీసులు జోడించనున్నారు.

పెట్టుబడుల సదస్సుకు 3,000 మంది...

దేశ, విదేశాల నుంచి రాక

- ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్‌ల వద్ద హెల్ప్ డెస్క్‌లు
- అతిథులకు సంప్రదాయ కళాకారులతో స్వాగతం
- ఏయూ మైదానంలో హెలిప్యాడ్లు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్
- విస్తృత ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా నవంబరు 14, 15 తేదీల్లో నగరం వేదికగా జరగనున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం అయ్యేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సన్నాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సుకు దేశ, విదేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధులు, ఇంకా రాయబారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వ్యాపార ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరగనున్న వేదిక వద్ద చేయాల్సిన పనులపై అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్‌ల వద్ద హెల్ప్ డెస్కులు పెట్టి అతిథులకు సంప్రదాయ కళాకారులతో స్వాగతం పలకాలన్నారు. నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్లకు ఇరువైపులా పచ్చని మొక్కలు నాటాలన్నారు. రోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలని, కార్యక్రమాల నిర్వహణ షెడ్యూల్ ఇతర వివరాలతో కూడిన హోర్డింగ్‌లు పెట్టాలని, అతిథులకు కాఫీ విత్ టేబుల్ బుక్స్, పర్యాటక ప్రాంతాల మాన్యువల్ పుస్తకాలు అందజేయాలన్నారు.

ప్రధాన వేదిక వద్ద మొక్కలతో అలంకరించాలన్నారు. ప్రతినిధుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా సాంకేతికతను వినియోగించుకోవాలని, డెలిగేట్స్‌కు కిట్లు, పాస్‌లు జారీ, ప్రధాన సదస్సు, అనుబంధ సదస్సు, బ్రేక్ అవుట్ సెషన్ల నిర్వహణ విషయంలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. ఏయూ ... మిగతా 6వ పేజీలో

మత్స్యకారులకు నేటి నుంచి సరుకులు

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):

మొంథా తీవ్ర తుఫాన్ కారణంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లలేకపోయిన 12,995 మంది మత్స్యకారులకు శనివారం నుంచి సరుకులు పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ప్రతి మత్స్యకార కుటుంబానికి 50కిలోల బియ్యం, కిలో చొప్పున పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, లీటరు పామాయిల్ రేషన్ డిపోల వద్ద పంపిణీ చేస్తామన్నారు. మత్స్యకారులు బియ్యం కార్డులో నమోదైన రేషన్ డిపోలకు వెళ్లి బయోమెట్రిక్ వేసి ఆధార్ కార్డు ద్వారా సరుకులు తీసుకోవాలన్నారు. ఇంకా తుఫాన్ సమయంలో సహాయ శిబిరాల్లో ఉన్న 181 మందికి కుటుంబానికి 25కిలోల బియ్యం, కిలోచొప్పున పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, లీటరు పామాయిల్ డిపోల వద్ద పంపిణీ చేస్తామన్నారు. రేషన్ దుకాణాలకు బియ్యం,ఇతర సరుకులు సరఫరా చేశామని, రెవెన్యూ సిబ్బంది, ప్రత్యేక అధికారులు పంపిణీలో అంతరాయం లేకుండా పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.

సాయి శ్రేయాస్‌కు మళ్లీ అనుమతులు!

- ఫార్మా కంపెనీలో ఇరవై రోజుల క్రితం ఉత్పత్తి పునఃప్రారంభం
- జూన్ 11న విష వాయువులు పీల్చి ఇద్దరు ఉద్యోగులు మృతి
- ప్రమాదం జరిగిన 75 రోజులకు కమిటీ నియామకం
- వ్యవస్థాగత లోపాలపై కానరాని అధ్యయనం
- నివేదికపై హెచ్‌ఆర్‌ఎఫ్ అభ్యంతరాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఇద్దరు ఉద్యోగుల ప్రాణాలు బలిగొన్న పరవాడ ఫార్మా సిటీలోని సాయి శ్రేయాస్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీలో మళ్లీ ఉత్పత్తి మొదలైంది. ఆ కంపెనీలో ఈ ఏడాది జూన్ 11వ తేదీ రాత్రి విషవాయువులు పీల్చి విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులు మరణించిన సంగతి తెలిసిందే. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిపోయిన వారిని తిరిగి వెనక్కి రప్పించి వారి ప్రాణాలు పోవడానికి యాజమాన్యం కారణమైందని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులు కంపెనీలో ఏపీ నిబంధనల ప్రకారం జరగడం లేదని, ఉత్పత్తులకు సంబంధించి సరైన రికార్డులు నిర్వహించడం లేదని గుర్తించి అదే విషయం ప్రభుత్వానికి నివేదించారు. దాంతో కంపెనీని మూసివేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం నియమించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ప్రమాద మూలాల జోలికి పోకుండా నివేదిక ఇవ్వడంతో మళ్లీ మందుల తయారీకి అనుమతులు ఇచ్చారు. ఇరవై రోజుల క్రితం అక్కడ ఉత్పత్తి ప్రారంభమైంది. దీనిపై మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.



సాయి శ్రేయాస్ ఫార్మాలో ప్రమాదం జరిగిన ప్రదేశం

ప్రమాదం జరిగిన 75 రోజుల తరువాత కమిటీ ఏర్పాటు

ఏదైనా ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగితే దానికి కారణాలు తెలుసుకోవడానికి వెంటనే కమిటీలు వేస్తారు. అప్పుడే వాస్తవాలు బయటకు వస్తాయి. కానీ సాయి శ్రేయాస్ విషయంలో కావాలనే జాప్యం చేశారు. జూన్ 11న ప్రమాదం జరిగితే 75 రోజులు దాటిన తరువాత (అప్పటికే అన్ని ఆనవాళ్లు నాశనమైపోయాయి) తీరుబడిగా ఆగస్టు 27న జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీని వేశారు. అధికారుల హోదాలకు ... మిగతా 6వ పేజీలో

వైద్యుడి వక్రబుద్ధి

- ఏఎంసీ పరిధిలోని ఓ బోధనాస్పత్రిలో అధికారి వికృత చేష్టలు
- వైద్యులు, పీజీ విద్యార్థినులు, నర్సింగ్ సిబ్బందిని లైంగికంగా వేధిస్తున్నట్టు ఆరోపణలు
- ఆయన వ్యవహారశైలి జుగుప్సాకరమంటున్న సిబ్బంది



విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర మెడికల్ కళాశాల (ఏఎంసీ) పరిధిలోని ఒక బోధనాస్పత్రి ఉన్నతాధికారి వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన ఆస్పత్రిలో పనిచేసే మహిళా వైద్యులు, పీజీ విద్యార్థినులు, నర్సింగ్ సిబ్బందితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే అభియోగాలు ఉన్నాయి. ఈ తరహా ఆరోపణలు చాలాకాలంగా ఉన్నప్పటికీ ఆయనపై ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బాధితులు పలువురు విజయవాడలోని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) కార్యాలయానికి ఫిర్యాదు చేసినా అవి బుట్టదాఖలు అవుతున్నాయి.

వారం క్రితం కూడా ఈ వైద్యాధికారి ఆస్పత్రిలో ఓపీ విభాగం నుంచి సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఓ వైద్య విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించబోయారు. ఈ ఆకస్మిక పరిణామానికి భయపడిన ఆమె పెద్దగా కేకలు వేశారు. ఓపీలో ఉన్నవారంతా పరుగెత్తుకు వచ్చారు. 'ఏమీ లేదు... అంతా వెళ్లిపోండి' అంటూ ఆయన వారిని వెనక్కి పంపేశారు. ఈ ఘటనపై కొందరు సీఎం కార్యాలయానికి, డీఎంఈకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీనిపై రహస్య విచారణ జరుగుతున్నట్టు సమాచారం.

తొలి నుంచి అదే తీరు..

ఇంకా ఆరేడేళ్ల సర్వీస్ ఉన్న ఈ సీనియర్ వైద్యుడు మెడిసిన్ చదువుతున్నప్పటి నుంచే ఇలాంటి వ్యవహారాలు ఎక్కువ నడిపేవాడని సహాధ్యాయులు చెబుతున్నారు. అమ్మాయిలను దక్కించుకునేందుకు తొలుత అధికారాన్ని ఉపయోగిస్తాడని, అప్పటికీ దారిలోకి రాకపోతే డబ్బు ఆశ చూపిస్తాడని తెలిసింది. తాను విధులు నిర్వర్తిస్తున్న కార్యాలయంలోనే అనేకసార్లు అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డారని సిబ్బంది చెబుతున్నారు. ఆయన వద్దకు మహిళా రోగులు వస్తే...పరీక్ష పేరుతో శరీరంపై ఇష్టానుసారం చేతులు వేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

బంధువులు పెద్ద స్థానంలో ఉన్నారని ధీమా

పోలీస్ శాఖలో, ఏసీబీలో ఆయన బంధువులు ఉన్నారు. దాంతో తనపై ఎవరు ఫిర్యాదు చేసినా ఏమీ కాదనే ధైర్యంతోనే లైంగిక వేధింపులకు ... మిగతా 6వ పేజీలో

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



సింహాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై ఉంచారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 5 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పర్యవేక్షణాధికారి నరసింగరావు

సింహాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి చినవాల్తేర్ ప్రాంతానికి చెందిన ఆర్వీ మనవాలియ రూ. 5 లక్షలు విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం అన్నప్రసాద విభాగం పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు శుక్రవారం ఆయన అందజేశారు. దాతకు అధికారులు స్వామివారి అంతరాలయ ప్రవేశం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

పర్యాటక ప్రాంతాల్లో ప్రవేశాలకు అనుమతి



తెరిచి ఉన్న కైలాసగిరికి వెళ్లే మార్గం

విశాలాక్షినగర్, సాగర్‌నగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో నాలుగు రోజులుగా మూసివేసిన పర్యాటక ప్రాంతాలను శుక్రవారం తెరిచారు. కైలాసగిరి, తెన్నేటీ పార్కులోకి సందర్శకులను అనుమతించడంతో ఆయా ప్రాంతాలు సందడిగా మారాయి. తీరంలో కెరటాల ఉధృతి తగ్గకపోవడంతో జోడుగుళ్లపాలెం తీరంలోకి అనుమతించలేదు. రుషికొండ బీచ్ వద్ద ఉన్న వ్యూపాయింట్‌కు కూడా సందర్శకులను అనుమతించారు. వాతావరణం అనుకూలించడంతో బీచ్‌లోకి అనుమతిస్తారనుకుంటే వ్యూపాయింట్ వరకే అనుమతించడంతో చాలా మంది సందర్శకులు నిరాశతో వెనుతిరిగారు. బీచ్ రోడ్డులో నిలిచిన డబుల్ డెక్కర్ బస్సుల సేవలు కూడా మొదలయ్యాయి.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

సింహాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ కార్పొరేటర్ పివి నరసింహం కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోశాల లేఅవుట్‌లో కమ్యూనిటీ భవనం, సీసీ రోడ్డు, కాలువ, రామాలయం నుంచి కుమ్మరివీధి వరకు, సంతోషిమాత ఆలయ వీధిలో, లండగరువులో, ఘాట్ రోడ్డు ప్రాంతంలో, కె. కన్వెన్షన్ వెనుక వీధిలో, సిడగం వీధిలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని తెలిపారు. అలాగే బీఆర్‌టీఎస్ కారిడార్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో రన్నింగ్ వాల్స్ నిర్మించాలన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

మధురవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని శిల్పారామం ఎదురుగా ఉన్న మిథిలాపురి వుడాకాలనీ వంద అడుగుల రహదారి ప్రారంభంలో గొయ్యి ఏర్పడింది. రాత్రి వేళ గొయ్యి కనిపించకపోవడంతో పాదచారులు, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు గొయ్యి చుట్టూ హోర్డింగులు అడ్డుపెట్టారు.అలాగే స్థానికులు మట్టితో గొయ్యిని పూడ్చారు. కానీ ఇటీవల పడిన వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో పరిస్థితి మళ్లీ యథావిధిగా మారింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ సింహాచలంనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.మధురవాడ, శివశక్తినగర్, చంద్రంపాలెం, మిథిలాపురి వుడాకాలనీ, నగరంపాలెం, రేవళ్లపాలెం, నవోదయ స్కూల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎండాడ : ఎండాడ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు జోన్ -3 ఆపరేషన్స్ ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. శిరిగుడినగర్, వివేకానందనగర్, దసపల్లా లేఅవుట్, రాజీవ్‌నగర్, ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డు, వరహాగిరినగర్, మహిళా పోలీసుస్టేషన్, శ్రీనివాసనగర్, ఎండాడ ఎస్సీ, బీసీ కాలనీ, ముబారక్ కాలనీ, గొల్లల ఎండాడ, శాంతినగర్, గణేశ్‌నగర్, ఎండాడ రామాలయం ప్రాంతంతో పాటు ఎండాడ పెట్రోల్ బంక్ వెనుక ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

పద్మనాభం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. లీలాప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం దోమల వ్యాప్తి వల్ల డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

స్థల వివాదంపై విచారణ

పద్మనాభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో రామాలయం స్థలంలో ఏర్పాటు చేసిన పాక, బడ్డీ తొలగింపుపై పోలీసులు శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఎం. ఆదినారాయణ రామాలయం నిర్మాణ స్థలంలో పాక, బడ్డీ ఏర్పాటు చేయడంతో గ్రామస్థులంతా ఏకమై తొలగించారు. దీనిపై ఆదినారాయణ పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ జరిపారు. గ్రామ కంఠం స్థలం కావడంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, పనులకు ఆటంకం కలిగించేలా ఎవరూ నిర్మాణాలు చేసినా తొలగించాలని గ్రామస్థులంతా కలిసికట్టుగా నిర్ణయం తీసుకున్నామని స్థానికులు పోలీసులకు తెలిపారు.

గిరిజన భాషల పరిరక్షణే లక్ష్యం

సాగర్‌నగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గిరిజన భాషలను పరిరక్షించడమే తమ ప్రథమ కర్తవ్యమని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా సంచాలకురాలు ఎస్.భార్గవి అన్నారు. రుషికొండ గిరిజన మ్యూజియంలో టీసీఆర్‌టీఎం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. గిరిజన కట్టుబాట్లు, సంస్కృతి సంప్రదాయాలు భాషతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ మందారాణి, డి. రమేశ్ భూషణ్, మృత్యుంజయరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ఇళ్ల నిర్మాణం వద్దన్నా.. వినలేదు

- గత ప్రభుత్వం హయాంలో అధికారుల నిర్వాకం
- భారీ వర్షాలకు కణమాం కాలనీలో చేరిన వాగు నీరు
- వర్షాలు తగ్గి రెండు రోజులైనా.. తొలగని వైనం
- లోతట్టు ప్రాంతంలో ఇళ్లు వద్దని అప్పట్లోనే స్థానికుల సూచన
- మొండిగా ముందుకు వెళ్లిన యంత్రాంగం



కణమాం గ్రామంలోని కాలనీ ఇళ్ల చుట్టూ ఉన్న నీరు, (ఇన్‌సెట్లో) ఓ ఇంటి వద్ద నిలిచిన నీరు

విశాఖపట్నం/ఆనందపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలంలోని కణమాం గ్రామంలో నిర్మిస్తున్న కాలనీ ఇళ్ల చుట్టూ వర్షం నీరు చేరింది. నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు సమీపంలోని కొండ నుంచి వాగుల ద్వారా వచ్చిన నీరు కాలనీలో ఇళ్ల చుట్టూ నిలిచిపోయింది. వర్షాలు తగ్గి రెండు రోజులైనా నీరు తొలగిపోలేదు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుంచీ ఇక్కడ ఇదే సమస్య కొనసాగుతోంది. నగరంలోని నిరుపేదలకు సెంటు స్థలంలో ఇళ్లు నిర్మించాలని గత పాలకులు జిల్లాలో 65 లేఅవుట్‌లు ఎంపిక చేశారు. అందులో భాగంగా ఈ గ్రామంలో 1500 మందికి లేఅవుట్ అభివృద్ధి చేశారు. వర్షం నీరు నిలిచిపోని ప్రాంతంలో లేఅవుట్‌ను అభివృద్ధి చేయాల్సి ఉండగా స్థానికులు పశువులు బీడుగా పిలుచుకునే ప్రాంతంలో 1500 మందికి ప్లాట్లు గుర్తించారు. ఇక్కడ ఏడాదిలో ఎక్కువ రోజులు కొండ ఊటతో చిన్నపాటి కాలువ లేఅవుట్ మీదుగా ప్రవహిస్తోంది. అంతేకాదు లేఅవుట్‌లో సగానికి పైగా లోతట్టు ప్రాంతమే. ఇళ్ల నిర్మాణాలకు ఏమాత్రం అనువుగా ఉండదు.స్థానికులు ఇక్కడ కాలనీ వద్దని వ్యతిరేకించారు. అయినా గత ప్రభుత్వంలో కొందరు అధికారులు మొండి పట్టుదలకు పోయి ప్లాట్లు వేశారు. వీఎంఆర్‌డీఏ కూడా వెనుకా ముందు చూడకుండా లేఅవుట్‌లో రోడ్లు అభివృద్ధి చేసింది. ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టరు తొలుత అభ్యంతరం చెప్పినా.. అప్పటి అధికారులు పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టరు పనులు ప్రారంభించి ఇంతవరకు 390 నిర్మాణాలు చేపట్టారు. వీటిలో 250 నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా 1110 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈలోగా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు కాలనీ ఇళ్ల చుట్టూ చేరింది. కాగా కాలనీలో ఇళ్ల నిర్మాణం చేయాలంటే తొలుత అక్కడ లేఅవుట్‌లో మట్టి కప్పి ఎత్తు పెంచాల్సి ఉంది. అలాకాకుండా పనులు చేపడితే ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టిసారించాలని కణమాం సర్పంచ్ ఆబోతు అప్పలరాము, తదితరులు కోరుతున్నారు.



సింహాచలం : సమైక్యతా ర్యాలీలో పాల్గొన్న వాకర్స్, పోలీసులు



భీమిలి బీచ్‌రోడ్‌లో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ

పటేల్ పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో వక్తలు

భీమునిపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలుచోట్ల సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమిలిలో సీఐ బొడ్డేపల్లి తిరుమలరావు ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ చేపట్టారు. పోలీసులు, యువత, విద్యార్థులు చిన్నబజారులోని పోలీసుస్టేషన్ నుంచి సెయింట్ ఆన్స్ స్కూల్,పాతబస్టాండ్, ఫైలాన్ మీదుగా బీచ్‌రోడ్‌లోని నోవాటెల్ వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ తిరుమలరావు మాట్లాడుతూ దేశ తొలి హోం మంత్రిగా వల్లభాయ్ పటేల్ జాతీయ సమైక్యత కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. యువత ఆయన బాటలో నడిచి ఐక్యతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రాధాకృష్ణ, భరత్ కుమార్‌రాజు, గౌరి, ఏఎస్ఐ శ్రీనివాసరావు పట్టణ ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, మారోజు గోపి, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పటేల్ జయంతి పురస్కరించుకుని జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ మాట్లాడుతూ పౌరులకు ప్రాథమిక హక్కులు ఎంత ముఖ్యమో వాటిని కాపాడుకోవలసిన బాధ్యత కూడా అంతే ముఖ్యమని పటేల్ చెప్పిన మాటలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : తొలి ఉప ప్రధాని, హోం శాఖా మంత్రి వల్లభాయ్ పటేల్ జయంతి, వాకర్స్ ఉద్యమ పితామహుడు, మాజీ మంత్రి సుంకర ఆళ్వార్‌దాసు జయంతి పురస్కరించుకుని గోశాలలోని ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. గోపాలపట్నం శాంతి భద్రతల సీఐ లంక సన్యాశినాయుడు, ట్రాఫిక్ సీఐ సురేశ్ ర్యాలీని ప్రారంభించారు. తొలుత వాకర్స్ క్లబ్ సభ్యులు ఆళ్వార్‌దాస్, పటేల్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గోశాల కూడలి నుంచి సింహాచలం తొలిపాంచా వరకు సమైక్యతా రన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు జి. సూర్యనారాయణ, అధ్యక్షుడు మురళీ, సలహాదారుడు రామకృష్ణ, పూర్వపు అధ్యక్షుడు గొర్లె నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో..

తగరపువలస : తగరపువలస డిగ్రీ కళాశాలలోనూ పటేల్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీవాణి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి. సీతంనాయుడు, బి. నాగరాజు, డా. సీతారత్నం, డా. బి. స్వర్ణలత పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో..

భీమునిపట్నం (రూరల్) : చిల్లపేటలో బీజేపీ నాయకులు పటేల్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిల్ల త్రినాథ్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి రెడ్డిపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు సీరపు రామలక్ష్మి, చిల్లపేట బూత్ ప్రెసిడెంట్ సీలాపు సూర్యం, గుజ్జు నర్సుబాయి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : పటేల్ పోరాట పటిమ యువతకు స్ఫూర్తిదాయమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి కేఎన్‌పీ చక్రవర్తి అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా ఎండాడ మండల బీజేపీ అధ్యక్షుడు చోడవరపు నాగరాజు ఆధ్వర్యంలో ఆరో వార్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో సంస్థానాల విలీనం ప్రక్రియను సమర్థంగా నిర్వహించిన వ్యక్తి సర్దార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు బీజేపీ అధ్యక్షుడు రాజు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖరరాజు, పెండ్యాల శ్రీనివాస్, రత్నశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగం మరువలేనిది



విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహిస్తున్న బెటాలియన్ సిబ్బంది

కొమ్మాది, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాడి ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం మరువలేనిదని 16వ పోలీస్ బెటాలియన్ అధికారులు అన్నారు. శుక్రవారం బక్కన్నపాలెం 16వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే జాతీయ సమైక్యతా దినోత్సవం, రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా బక్కన్నపాలెం నుంచి బెటాలియన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాలకృష్ణ విద్యార్థులకు ఆయుధాల పని తీరు గురించి వివరించారు.

పెట్టుబడుల సదస్సుకు 3,000 మంది

... 5వ పేజీ తరువాయి

మైదానంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉపరాష్ట్రపతి నేరుగా ల్యాండ్ అయ్యేలా హెలిప్యాడ్‌లు సిద్ధం చేయాలన్నారు. మంత్రులు, ఇతర ప్రముఖుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, వసతి జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రెండు రోజులపాటు ప్రధాన వేదిక వద్ద ఉంటారని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిరంతరం విద్యుత్ ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజుల సదస్సుకు వచ్చే అతిథులు పర్యాటక ప్రాంతాలు, ఆలయాల సందర్శనకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంటూ ఆయా ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు ముందుగా చేపట్టాలన్నారు. కార్యక్రమాలకు జేసీ మయూర్ అశోక్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఉంటుందని పేర్కొంటూ అక్కడ నుంచి సహాయ సహకారాలు అందుతాయని చెప్పారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల సమ్మె విరమణ

... 5వ పేజీ తరువాయి

విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో సమ్మెను విరమిస్తున్నట్టు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రకటించాయి. రోగుల ఇబ్బందుల దృష్ట్యా నెట్‌వర్క్ హాస్పటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రభుత్వం సంప్రతింపులు చేసి సమ్మె విరమింపజేసిందని జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కో-ఆర్డినేటర్ కె. అప్పారావు తెలిపారు.

వైద్యుడి వక్రబుద్ధి

... 5వ పేజీ తరువాయి

పాల్పడుతున్నారని ప్రచారం ఉంది. తన వాంఛలు తీర్చుకునేందుకు ఎవరూ లభించనప్పుడు బయట కాల్‌గర్ల్స్‌ని కూడా బుక్ చేసుకుంటారని, వారిని నగరంలోని స్టార్ హోటళ్లకు తీసుకువెళతారని తెలిసింది. తాజాగా వారం క్రితం ఓ స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేసుకొని ఓ మహిళను తీసుకువెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కీచక వైద్యాధికారిపై విచారణ చేసి, తగిన చర్యలు చేపట్టాలని వైద్య విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న భవనం (ఇన్‌సెట్లో) పెచ్చులూడిన శ్లాబ్

శిథిలావస్థలో సచివాలయ భవనం

సింహాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పాత అడివివరంలో 529 సచివాలయం నిర్వహిస్తున్న భవనం పూర్తిగా శిథిలమైంది. ఈ భవనాన్ని నిర్మించి 30 ఏళ్లు కావస్తోంది. నాటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో పాడైంది. దీనికి తోడు 2023లో బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో భాగంగా భవనంలో కొంత భాగాన్ని కూల్చి వేశారు. అసలే మరమ్మతులతో ఉన్న భవనంలో కొంత భాగాన్ని కూల్చివేయడంతో మరింత పాడై, ఏ క్షణాన కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు తక్షణమే స్పందించి ఏదైనా ప్రమాదం జరగకముందే భవనాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

జూట్‌మిల్లు ఆస్తుల అమ్మకానికి వీల్లేదు

- జాయింట్ లేబర్ కమిషనర్‌కు కార్మిక సంఘాల లేఖ

తగరపువలస, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం తన ఆధీనంలో ఉన్న భూములను అమ్ముకోవడానికి కార్మిక నాయకుల అభ్యంతరాలతో ఉన్న అటాచ్‌మెంట్‌ను తొలగించాలని కోరుతూ జాయింట్ లేబర్ కమిషనర్ రామారావుకు లేఖ రాసింది. మిల్లు యాజమాన్యానికి చిట్టివలసలో సుమారు రూ. 200 కోట్ల విలువైన భూములు ఉన్నాయి. వాటిలో కొన్ని అమ్మేశారు. ఈ విషయం తెలిసిన కార్మిక సంఘాలు స్థానిక ఎమ్మెల్యేకు, కార్మిక శాఖాధికారుల వద్దకు వెళ్లి కార్మికులకు పరిహారాలు చెల్లించలేదని, భూములు అమ్మడానికి అభ్యంతరం తెలియజేస్తూ కోర్టు ద్వారా అటాచ్‌మెంట్‌ను తీసుకువచ్చారు. అటాచ్‌మెంట్ ఎవరు తీసుకువచ్చారో వారు తొలగిస్తే తప్ప భూములు అమ్ముకోవడానికి వీలుండదు. అమ్మకాలు జరిగినా రిజిస్ట్రేషన్ జరగదు. ఈమేరకు యాజమాన్యం జాయింట్ లేబర్ కమిషనర్‌కు లేఖ రాసింది. ఈ లేఖ ఆధారంగా కమిషనర్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితిలో ఉన్న పలు సంఘాలకు అటాచ్‌మెంట్‌ను తొలగించే విషయం పరిశీలించాలని లేఖ రాశారు. ఈ లేఖకు కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం జవాబు రాశారు, యాజమాన్యం కార్మికులకు వివిధ రూపాల్లో సుమారు రూ. 120 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని, వాటిని చెల్లించకుండా భూముల అమ్మకానికి ఎలా అనుమతి ఇస్తామని ప్రశ్నించారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని, బకాయిలు చెల్లించిన తరువాతే అటాచ్‌మెంట్ తొలగింపునకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈమేరకు లేఖపై ఐఎన్‌టీయూసీకి చెందిన జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, కాంగ్రెస్ కార్మిక సంఘానికి చెందిన జీరు కైలాస్‌రెడ్డి, మునకాల ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కొండపు ఈశ్వరరావు, చిల్ల రామ పైడయ్య, టీఎన్‌టీయూసీకి చెందిన మద్దిల గురుమూర్తి, సాడి అచ్చారావు, సరవ రామారావు సంతకాలు చేశారు.

ఫీటల్ రేడియాలజీపై వర్క్‌షాప్

ఎండాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్)లో ఏపీ ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫీటల్ రేడియాలజీపై శుక్రవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో బెంగళూరుకు చెందిన డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ మూడు నెలల గర్భధారణ దశలో భ్రూణ వ్యాధులను ఎలా గుర్తించాలో వివరించారు.మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శిల్పా సత్కరర్ ఆరు నెలల గర్భిణిలకు స్కానింగ్ పద్ధతుల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన డాక్టర్ భవాహరణ్, ఏపీఐఆర్ఐఏ అధ్యక్షుడు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ వి. సురేశ్, కార్యదర్శి డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ వర్మ, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, రేడియాలజీ పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సాయి శ్రేయాస్‌కు మళ్లీ అనుమతులు!

... 5వ పేజీ తరువాయి

అనుగుణంగా కమిటీలో స్థానం కల్పించారు. కానీ ఆ రంగంలో నైపుణ్యం కలిగినవారే కారణాలు గుర్తించగలరనే విషయం విస్మరించారు. దీనినే మానవ హక్కుల వేదిక తప్పుబట్టింది. నలుగురు సభ్యులు కలిగిన ఇన్‌స్పెక్షన్ కమిటీ సెప్టెంబరు ఒకటో తేదీన కంపెనీ ప్రాంగణాన్ని సందర్శించి అన్నీ పరిశీలించింది. ఆ మరుసటిరోజు నివేదిక తయారుచేసి అందించింది.

విషవాయువులు పీల్చడం వల్లనే మరణాలు

- ఎఫులియెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో వ్యర్థాలను న్యూట్రలైజేషన్ చేస్తుండగా పరిశీలనకు వెళ్లిన ఇద్దరు భద్రతా విభాగం ఉద్యోగులు ట్యాంకు మ్యాన్‌హోల్ నుంచి వచ్చిన విషవాయువులు (సల్ఫ్యూరిక్ యాసిడ్, అమోనియా, ఓలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్) పీల్చడం వల్లనే మరణించారని ఇన్‌స్పెక్షన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా కంపెనీకి కొన్ని సూచనలు చేసింది.
- కంపెనీలో ఇంకా 80 కిలోలీటర్ల ఎఫులియెంట్ స్టోరేజ్ ట్యాంకులో ఉంది. దానిని వెంటనే బయటకు తరలించాలి.
- ఎఫులియెంట్ స్టోరేజ్ ట్యాంక్ ప్రాంతంలో వాయువులను గుర్తించే పరికరాలు ఏర్పాటుచేయాలి.
- ప్రామాణిక ఆపరేషన్ విధానాలు (ఎస్‌ఓపీ) పాటించాలి.
- న్యూట్రలైజేషన్ ప్రక్రియను జనరల్ షిఫ్ట్‌లోనే నిర్వహించాలి.
- ఎఫులియెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు అనుసంధానం చేసిన స్క్రబ్బర్‌కు ప్రత్యేకంగా విద్యుత్ మీటర్ ఏర్పాటుచేసి, వాటి రీడింగ్ ప్రతి నెలా కాలుష్య నియంత్రణ మండలికి పంపాలి.
- ప్రమాదకరమైన వ్యర్థాలను ఎప్పటికప్పుడు సీఈటీపీకి పంపించాలి. నిల్వ ఉంచకూడదు.

హెచ్‌ఆర్ఎఫ్ అభ్యంతరాలు

జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ లోపాలను బహిర్గతం చేయలేదని హెచ్‌ఆర్ఎఫ్ ఆరోపించింది. కంపెనీలో అంతర్గత భద్రత వైఫల్యాల వల్లే ఈ ప్రమాదం జరిగిందని, దానిని నిర్ధారించలేదని పేర్కొంది. కంపెనీలో స్క్రబ్బింగ్ విధానం లోపభూయిష్టంగా ఉన్నా దానిని తప్పుపట్టలేదని కూడా విశ్లేషించింది. ఈ నివేదిక అశాస్త్రీయంగా, బాధ్యతారాహిత్యంగా ఉందని ఆరోపించింది. నిర్వహణ లోపాలు, భద్రతా వైఫల్యాలు, నియంత్రణ అంశాలను విస్మరించిందని పేర్కొంది. ఇకపై ఏదైనా ప్రమాదం జరిగితే 48 గంటల్లో కమిటీని వేయాలని డిమాండ్ చేసింది. ఈ ప్రమాదాన్ని గుణపాఠంగా తీసుకుని రాష్ట్రంలో యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ ట్రైనింగ్ ప్రవేశపెట్టాలని సూచించింది.

దెబ్బతిన్న రహదారులు

... 5వ పేజీ తరువాయి

కొట్టుకుపోయాయి. వరదకు ఆనందపురం మండలం శొంఠ్యాం-పేకేరు మార్గంలో శిర్లపాలెం వద్ద కల్వర్టు, పెందుర్తి మండలం రాజయ్యపేటలో రోడ్డు కొట్టుకుపోయాయి. శిర్లపాలెం వద్ద కొట్టుకుపోయిన కల్వర్టుకు సుమారు మూడు లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసి, గ్రామాల మధ్య రాకపోకలను పునరుద్ధరించారు. రాజయ్యపేటలో కొట్టుకుపోయిన రోడ్డు మరమ్మతులకు సుమారు రూ.25 లక్షల వరకు నిధులు అవసరమని అంచనా వేశారు. పంచాయతీలో రూ.25 లక్షలు లేకపోతే మండల గ్రాంటు నుంచి నిధులు విడుదల చేయాలని యోచిస్తున్నారు. అలాగే భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం గ్రామంలోకి నీరు ప్రవేశించింది. దీంతో గ్రామస్థులను పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే ఆనందపురం మండలం పొడుగుపాలెం కాలనీలో ఇళ్లలోకి వర్షపునీరు వచ్చే అవకాశం ఉందని ముందుగానే గుర్తించి అక్కడ ప్రజలకు పునరావాస శిబిరానికి తరలించారు. పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో దెబ్బతిన్న రోడ్లు, అప్రోచ్ రోడ్లు, కల్వర్టులు, భవనాల మరమ్మతులకు ఏ మేరకు నిధులు అవసరమవుతాయో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కాగా గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా కాలువల్లో పూడికతీత చేపట్టినట్టు జిల్లా పంచాయతీ అధికారి ఎం.ఎస్.వి. శ్రీనివాసరావు తెలిపారు. రక్షిత మంచినీటి ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేశామన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. కార్ల యజమానుల పాలిట శాపం

- కాలువల నిర్మాణం కోసం రోడ్డు పక్కన తవ్వకాలు
- నెలల తరబడి కొనసాగుతున్న పనులు
- ర్యాంపులు తవ్వేయడంతో రోడ్డుపైనే కార్లు నిలపాల్సిన పరిస్థితి
- మొంథా తుపాను సమయంలో చెట్లు పడడంతో ధ్వంసమైన వాహనాలు


పిఠాపురం కాలనీ రోడ్డులో తవ్వేసిన అపార్ట్‌మెంట్ల ర్యాంప్‌లు


రోడ్డుపై చెట్ల కింద పార్కింగ్ చేసిన కార్లు

మద్దిలపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటం విశాఖ 22వ వార్డులో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నివాసులు మొంథా తుపాను దెబ్బకు భారీ మూల్యం చెల్లించుకున్నారు. ఇంటి ముందు ర్యాంప్‌లు తొలగించడంతో రోడ్డు మీద వాహనాలు పార్కింగ్ చేసి నష్టపోయారు. వార్డులోని పిఠాపురం కాలనీ బాబా ఆలయం రోడ్డులో నలభై రోజుల కిందట కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు వంద మీటర్లు ఉన్న ఈ కాలువ నిర్మాణానికి నాలుగైదు రోజుల్లో పూర్తి చేయవచ్చు. ఇందుకోసం ముందుగా అపార్ట్‌మెంట్లు, ఇళ్ల ముందున్న ర్యాంప్‌లను తొలగించారు. వాస్తవానికి ర్యాంప్‌లు పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేకపోయినా అంతకు రెండింతలు తవ్వేశారు. దీంతో అపార్ట్‌మెంట్లు, ఇంటి నివాసులు తమ వాహనాలు తమ ఇళ్ల ముందు పార్కింగ్‌కి వాహనాలు తీసుకెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో తాత్కాలికమే అన్న ఉద్దేశంతో కార్లను ఎవరి ఇంటికి వారు రోడ్డుపైనే నిలిపి ఉంచారు. అయితే నాలుగైదు రోజుల్లో పూర్తి చేయాల్సిన పనులు నెలల తరబడి కొనసాగించడంతో వాహనదారులు సర్దుబాటు చేసుకున్నారు.

కాగా గత నెల 26 నుంచి మొంథా తుఫాన్‌కు వీచిన గాలులకు పిఠాపురంకాలనీ రోడ్డులో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈ క్రమంలో చెట్ల కింద పార్కింగ్ చేసిన వాహనాలపై పడడంతో 6 కార్లు ధ్వంసమయ్యాయి. భారీగా ఈదురుగాలులు వీస్తున్నా వాహనాల యజమానులు చూస్తూ ఉండడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. చెట్లు, చెట్ల కొమ్మలు కార్లపై పడడంతో చాలా వాహనాలు ధ్వంసమయ్యాయి. సకాలంలో కాలువల నిర్మాణం పూర్తి చేసి ఉన్నట్టయితే రోడ్డుపై కార్లు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉండేది కాదని, అప్పుడు తమ వాహనాలు ధ్వంసమయ్యే దుస్థితి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందు నిలిపిన కార్లపై కళ్ల ముందే చెట్లు, పెద్ద కొమ్మలు పడుతుండే ఏమీ చేయలేని నిస్సహాయతలో ఉండిపోవాల్సి వచ్చిందని, ఇది జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్య ఫలితమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాబా ఆలయం రోడ్డే కాకుండా 22వ వార్డులో అన్నీ వీధుల్లోని రోడ్ల పరిస్థితి దాదాపు ఇదే విధంగా ఉంది. వార్డులో 8 నెలల నుంచి డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్నారు. వీధుల్లో తవ్వేసి అలాగే వదిలేస్తున్నారు.

ఇప్పటి వరకు ఒక్క వీధిలోని కాలువ కూడా పూర్తి స్థాయిలో పూర్తి చేయలేదు. గోతులు తీసేయడం.. వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ వార్డుకు జీవీఎంసీ వర్క్స్ ఇంజనీర్ లేనందున పనులు పర్యవేక్షించే నాథుడే కరువయ్యారు. సచివాలయ కార్యదర్శులు సైతం తమకు ఏమీ పట్టనట్టు వదిలేయడంతో అభివృద్ధి పనులే ప్రజలకు సమస్యలుగా మారాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు వార్డులో పనులు నిర్వహణ తీరును పర్యవేక్షించి ఆయా పనులు త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

- వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి సూచన


పెండింగ్ చలానాలు వసూలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) వాహనదారులు తమ వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలు తక్షణమే చెల్లించాలని ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి కోరారు. మద్దిలపాలెం కూడలిలో శుక్రవారం ఆయన తమ సిబ్బందితో కలిసి పెండింగ్ చలానాలు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర రవాణా శాఖ విడుదల చేసిన ముసాయిదా ప్రకారం అయిదు కంటే ఎక్కువ చలానాలు ఉంటే లైసెన్సు రద్దు చేసే అవకాశంతో పాటు వెహికల్ స్వాధీనం చేసుకునే వీలుందన్నారు. గతంలో చలానాలు చెల్లించడానికి ఉండే 90 రోజులు గడువును 45 రోజులకు తగ్గించారని తెలిపారు. చలానాలు చెల్లింపులో ఆలస్యం చేస్తే వాహనాలు విక్రయించే వీలుండదని సూచించారు. అందుకే వాహనదారులు ఆన్‌లైన్‌లో చలానాలు చెక్ చేసుకుని చెల్లించాలన్నారు. అనంతరం కూడలిలో వాహనాలను నిలిపి చలానాలు చెక్ చేశారు. పెండింగ్ ఉన్న చలానాల మొత్తాన్ని అక్కడికక్కడే వసూలు చేశారు. ట్రాఫిక్ హెచ్‌సీ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు వాహనాల చలానాలు తనిఖీ చేశారు.

సర్దార్ వల్లభాయ్‌పటేల్ స్ఫూర్తితో పనిచేయాలి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం
- మాజీ ఉప ప్రధానికి ఘన నివాళి


వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి


ఏయూలో పటేల్‌కు నివాళులు అర్పిస్తున్న రెక్టార్ కింగ్, రిజిస్ట్రార్ రాంబాబు తదితరులు

మద్దిలపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని, స్వర్గీయ వల్లభాయ్‌పటేల్ స్ఫూర్తితో పోలీస్ సిబ్బంది పని చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి సూచించారు. రేంజ్ పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవంలో ఆయన పాల్గొని వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ గోపినాథ్ జట్టి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక రాచరిక రాష్ట్రాలను భారత యూనియన్‌లో విలీనం చేయడానికి వల్లభాయ్ పటేల్ పోషించిన అత్యంత కీలక పాత్ర దేశ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. దేశ సమైక్యత, ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు పటేల్ అని కొనియాడారు. భారతదేశ తొలి ఉప ప్రధాని, హోంమంత్రిగా ఎన్నో సేవలు అందించారన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు అంకిత భావంతో పని చేయాలని పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యాలయం మేనేజర్ బాలాసూర్యారావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో..

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని శుక్రవారం సెనెట్ సమావేశ మందిరంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి రెక్టార్ పి.కింగ్, రిజిస్ట్రార్ కె.రాంబాబు తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెక్టార్ కింగ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యానంతరం కేంద్ర మంత్రి మండలిలో హోంశాఖ మంత్రిగా, దేశ మొదటి ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. దేశం సమైక్యతతో ఉండేందుకు వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను కొనియాడారు. నేటి తరం యువత పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని దేశ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కేంద్రం సంచాలకుడు డి.సింహాచలం, డీన్లు ఎస్.హరనాథ్, జి.నానాజీరావు, టీవీ కృష్ణ, వి.భాస్కరరెడ్డి, వి.ధనరాజ్, పాల్ డగ్లస్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు


ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు సభ్యులతో సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలురు, బాలికల విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం ముగిశాయి. సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో జరిగిన ఈ పోటీలకు విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి విలువిద్య క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ ఈవెంట్లలో ఉమ్మడి విశాఖ నుంచి బాలికల విభాగంలో కె.సాయి మనస్వి, పి.హర్షిత, ఎస్.మోక్షిత, తాస్వి, కీర్తిమొదప్రియ, వి.కీర్తిక, వి.ఆద్య.. బాలుర విభాగంలో కె.అశ్రిత్ సాయికృష్ణ, డి.గౌతమ్, వి.లలిత్‌సాయి, పూర్వ రాథోడ్, ప్రసాద్‌నాయుడు, మోహిత్‌సాయి, ఎం.మనోజ్‌కుమార్, సంతోష్ ప్రాతినిధ్యం వహిస్తారని ఉమ్మడి విశాఖ జిల్లా అర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. జట్టు సభ్యులను సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ తదితరులు అభినందించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆరిలోవ రైతుబజార్‌కు సెలవుల రద్దు

- కార్తీక మాసం, మాలధారణల సీజన్ కావడంతో అధికారులు నిర్ణయం


ఆరిలోవ రైతు బజార్‌ప్రాంగణం

ఆరిలోవ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ రైతు బజార్ ప్రతి రోజూ కొనుగోలుదారులతో కిటకిట లాడుతోంది. నిన్నటి వరకు 35 స్టాళ్లకు పరిమితమైన రైతు బజార్‌లో శుక్రవారం నుంచి మరో పది స్టాళ్లు కలిశాయి. మొత్తం 45 స్టాళ్లతో ప్రసుతం ఈ బజార్ నడుస్తోంది.

కార్తీక మాసంతో పాటు వివిధ మాలాధారణ సీజన్ కావడంతో కూరగాయలకు ఎనలేని డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో రైతుబజార్‌కు సెలవులను రద్దు చేస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నవంబరు 18 వరకు సెలవుల రద్దు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల ప్రారంభించిన ఈ రైతు బజార్‌కు ప్రతి మంగళవారం సెలవు ప్రకటించారు. కూరగాయలకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో దళారుల రంగ ప్రవేశం, వ్యాపారులు తమ ఇష్టం వచ్చిన ధరలకు విక్రయాలు జరిపే అవకాశం లేకుండా సెలవుల రద్దు నిర్ణయాన్ని తీసుకున్నట్టు రైతు బజార్ ఎస్టేట్ అధికారి నాయుడు పేర్కొన్నారు.

పోర్టు స్టేడియంలో నేటి నుంచి ఎఫ్‌సీఎల్ క్రికెట్ టోర్నీ


జెర్సీలతో టోర్నీలో పాల్గొనే జట్లు కెప్టెన్లు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోర్టు అథారిటీ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనున్న ఫ్రెండ్స్ క్రికెట్ లీగ్ టోర్నీకి సంబంధించి జెర్సీని నిర్వాహకులు కరణ్, భార్గవ్ శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శనివారం నుంచి జరగనున్న ఈ టోర్నీలో 12 ఫ్రాంచైజ్ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఇటీవల గోవాలో జరిగిన జట్టు సభ్యుల వేలంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత స్థాయి క్రికెటర్లను వివిధ ఫ్రాంచైజర్లు కొనుగోలు చేసి జట్లను పటిష్ఠంగా రూపొందించామని పేర్కొన్నారు. శనివారం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనున్న ఈ టోర్నీలో వైజాగ్ బుల్స్, దయారామ్ రాయల్స్, ద ఈగల్ బాయ్స్, సూపర్ టాసెర్స్, బిబి కింగ్స్, హైఫై డైమండ్, స్వాన్ సూపర్ స్ట్రైకర్స్, హెచ్‌సీఏ బ్లాస్టర్స్, సోనా సూపర్‌కింగ్స్, కోచర్, అవెంజర్స్, హై ఫ్లైయర్స్ జట్లు పాల్గొంటాయని వివరించారు.

కుంగిన యూజీడీ పైపులైన్


చిల్డ్రన్ పార్కుకు సమీపంలో కుండిన యూజీడీ పైపులైన్

ఆరిలోవ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులోని చిల్డ్రన్ పార్కుకు సమీపంలో అండర్ గ్రౌండ్ పైపులైన్‌పై వేసిన సిమెంట్ కాంక్రీట్ సుమారు అడుగు లోతు కుంగిపోయింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళల్లో మరింత ఇబ్బందిగా ఉందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూజీడీ పనుల నాణ్యత లోపం కారణగా ఇలా జరిగిందని పలువురు మండి పడుతున్నారు. ఈమార్గంలో ఎక్కువ గుంతలు కూడా ఉన్నాయని, రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని అంటున్నారు. జీవీఎంసీ అధికారులు స్పం దించి ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

15, 16 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ


బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

వెంకోజీపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత నాలుగు రోజులు కురిసిన మొంథా తుపాను కారణంగా వర్షాలకు దోమలు, ఈగలు వ్యాపించకుండా పారిశుధ్య కార్మికులు తగు జాగ్రత్తలను తీసుకున్నారు. జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం, దుర్గానగర్ కొండవాలు ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందకుండా స్ప్రేయింగ్ నిర్వహించారు. అలాగే 16వ వార్డులోని పాత వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లోని వీధుల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు కాలువలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కిషోర్, సూరిబాబు మాట్లాడుతూ వర్షాల కారణంగా విషజ్వరాలు వ్యాపించే అవకాశాలున్నాయని, కాబట్టి ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచిన నీరు తాగాలన్నారు.

సినిమా గైడ్

- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), ,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు 38, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 74,అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోసకాయలు 38, పోటల్స్ 58,వెల్లుల్లి (పెద్దవి)65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 52, కంద దుంప 46, ముల్లంగి 30, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిదగుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడిఅల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

జీవీఎంసీలో 19 మంది ఉద్యోగుల పదవీ విరమణ



పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సత్కరిస్తున్న ఏడీసీ రమణమూర్తి, జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అధికారి అప్పలనాయుడు తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందాయకంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు శుక్రవారం ఆయన జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులను జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అధికారి అప్పలనాయుడుతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబం కంటే అధిక కాలాన్ని సంస్థ కోసం పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ జి.శ్రీరామ్మూర్తి, టాక్స్ కలెక్టర్ పీబీ నాగేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బి.కాళిదాసు, డ్రైవర్ జి.బాలకృష్ణ, 12 మంది పీహెచ్ వర్కర్లు, ముగ్గురు మినిమం టైం స్కేల్ సిబ్బందితో కలిపి మొత్తం 19 మంది ఉద్యోగుల పదవి విరమణ పొందారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

అక్కయ్యపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన స్థానిక ఎన్‌జీజీవోస్ కాలనీ పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌లో ప్రతిభ చూపిన కె.అనూష, కె.దేవి, వై.భావన, డి.వర్షిణి, ఎస్.సిద్ధార్థలను, హ్యాండ్‌బాల్‌లో విజయం సాధించిన కె.లక్ష్మి, శ్రీప్రియలను ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయినులు రత్నం, జ్యోతి పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం


ఊరేగింపుగా తీసుకువస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహం

వెంకోజీపాలెం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సీతారామాలయంలో 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. సాయంత్రం పాతవెంకోజిపాలెంలోని సీతారామాలయంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహ దాత కళ్ల శ్రీనివాస్ దంపతులతో పాటు మహిళలంతా ప్రత్యేక పూజలు నిర్వహించి, చెరుకు గడలు, అమ్మవారి పీఠం వంటివి మోసుకుంటూ ఊరేగింపుగా కొత్త వెంకోజీపాలెం భూలోకమాత ఆలయానికి వెళ్లారు. అనంతరం అక్కడ గౌరీ పరమేశ్వర ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తిరిగి మహిళలంతా గౌరీ పరమేశ్వరులను తలపై మోస్తూ ఊరేగింపుగా సీతారామాలయానికి వచ్చి అక్కడ ప్రతిష్ఠించారు. మేళతాళాలతో, బ్రాహ్మణ మంత్రోచ్చరణ మధ్య గౌరమ్మతల్లిని తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో గౌరీపరమేశ్వరుల విగ్రహాలను పొందుపరచి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కర్రి వెంకట సూరిఅప్పారావు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్, జనసేన నాయకులు పీల వెంకట పరదేశినాయుడు, గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు, పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాధవి


ఆందోళన నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

సిరిపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్ మాధవి, వై.సత్యవతి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోసమని గత నాలుగేళ్లుగా విశాఖలోని వివిధ వర్గాల వారు ఆందోళనలు చేస్తునే ఉన్నారని, ప్రైవేటీకరణపై విషయమై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. ఏళ్ల తరబడి స్టీల్ ప్లాంటును నమ్ముకొని జీవనం సాగిస్తున్న వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల పొట్టకొట్టే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుండడం దుర్మార్గమైన చర్య అన్నారు. వీఆర్ఎస్ పేరుతో పర్మినెంట్ ఉద్యోగులను సైతం తొలగించే ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. స్టీల్ ప్లాంటును బహిరంగ మార్కెట్‌లో అమ్మేయాలనే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు అన్ని సంఘాలను కలుపుకొని భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు వరలక్ష్మి, లక్ష్మి, విమల, కుమారి, మణి, మమత, సత్యవతి పాల్గొన్నారు

హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో డీఆర్ఎం పర్యటన


హెచ్‌పీసీఎల్ అధికారులతో సమావేశమైన డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో డీఆర్ఎం లలిత్ బొహ్రా శుక్రవారం పర్యటించి రైల్వే సైడింగ్‌ను తనిఖీ చేశారు. అనంతరం హెచ్‌పీసీఎల్, రైల్వే అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ రెండు శాఖల మధ్య సహకార సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడానికి అవసరమైన అభివృద్ధి పనులపై సమీక్షించారు. లోడింగ్ కార్యకలాపాలు, సైటింగ్‌ల విస్తరణపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు. హెచ్‌పీసీఎల్‌లో రైల్వే కార్యకలాపాలు పెంచడానికి సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ, సీనియర్ డీసీఎం పవన్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ద్వారకా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ



పోలీసు స్టేషన్‌కు వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

సీతంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. శాంతిభద్రతల పరిస్థితి, పలు కేసులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. కేసుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల నిందితులను పట్టుకోవాలని సీఐ డి.వెంకటరమణను ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. స్టేషన్‌కి వచ్చి ఉన్న బాధితులతో మాట్లాడి వారికి పోలీసుల నుంచి అందుతున్న సేవలను, కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో డీఆర్ఎం పర్యటన

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో డీఆర్ఎం లలిత్ బొహ్రా శుక్రవారం పర్యటించి రైల్వే సైడింగ్‌ను తనిఖీ చేశారు. అనంతరం హెచ్‌పీసీఎల్, రైల్వే అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ రెండు శాఖల మధ్య సహకార సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడానికి అవసరమైన అభివృద్ధి పనులపై సమీక్షించారు. లోడింగ్ కార్యకలాపాలు, సైడింగ్‌ల విస్తరణపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు. హెచ్‌పీసీఎల్‌లో రైల్వే కార్యకలాపాలు పెంచడానికి సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ, సీనియర్ డీసీఎం పవన్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యకు వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్

డాబాగార్డెన్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్త తరలించే వైసీపీ మద్దతుదారుడైన క్లాప్ వాహనాలు, లోడర్స్ సంస్థ దుర్గా కన్సల్టెన్సీ సర్వీసెస్ అధినేత వెంకటరెడ్డి అక్రమాలు, అవినీతి, ఉల్లంఘనలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ శుక్రవారం మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లను కోరారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వారి చాంబర్లలో కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అర్ధాంగి భారతి పేరు చెప్పి వైసీపీ హయాంలో జీవీఎంసీలోకి వచ్చిన ఈ సంస్థ యజమాని వెంకటరెడ్డి కొందరు అధికారులతో కుమ్మక్కై జీవీఎంసీకి కోట్లాది రూపాయలు పంగనామం పెడుతున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి కాంట్రాక్టర్‌పైన, అతనికి సహకరిస్తున్న ప్రజారోగ్యశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కంచరపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద గల త్రి స్టార్స్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. న్యూ లైఫ్ రక్తదాన బ్యాంక్ ప్రతినిధులు పాల్గొని వాకర్స్ నుంచి రక్తం సేకరించి భద్రపరిచారు. సీనియర్ వాకర్స్, క్లబ్‌కు విశేష సేవలందించిన ప్రముఖ న్యాయవాది పెతకం సర్వోత్తమ సుకుమార్ జన్మదినం సందర్భంగా రక్తదానం, పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వాకర్స్ సత్యనాథం, ద్వారకానాథ్‌లు మాట్లాడుతూ ఆరోగ్యవంతులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేదలకు అన్నదానం చేశారు. మహేష్, జ్యోతి కమల, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురాంరాజు, అధిక సంఖ్యలో వాకర్స్ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన

కంచరపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నవంబరు నెల రేషన్ సరుకుల పంపిణీని మూడు రోజుల ముందుగానే ప్రారంభించింది. ఆయా డిపోల ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం, పంచదార, ఇతర సరుకులను పంపిణీ చేస్తుంది. 55వ వార్డులో ఈ సరుకుల పంపిణీని టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాత శుక్రవారం పరిశీలించి ప్రజలకు సకాలంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరుబాబు, ఈశ్వరరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మార్పులను అందిపుచ్చుకుంటేనే ప్రగతి

- ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆర్జేడీ బి. విజయభాస్కర్ నిర్దేశం



ప్రసంగిస్తున్న ఆర్జేడీ బి.విజయభాస్కర్

డాబాగార్డెన్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కాలానుగుణంగా ప్రతీ ఒక్కరూ మార్పులను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్జేడీ బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా, క్వెస్ట్ అలియన్స్ సమన్వయంతో అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠ్యాంశాలను సెకండరీ స్కూల్స్‌లో అమలు చేసేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆర్జేడీ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా అనేక మార్పులు వచ్చాయని, నేడు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ప్రగతి సాధ్యపడుతుందన్నారు. మనకున్న ప్రతిభకు సహాయపడుతూనే, లోపాలను సరిద్దుకోవడానికి దోహదపడుతుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమగ్రశిక్షా ఏపీసీ జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏఐ ద్వారా బోధన అంశాలను విద్యార్థులకు చెప్పేందుకు ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ లక్ష్మి, సెక్టోరల్ అధికారులు, క్వెస్ట్ అలియన్స్ నిర్వాహకులు, ఫెసిలిటేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సహాయం



సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పునరావాస కేంద్రాల్లో గుర్తించిన పేదలకు మాధవధార ఉడాకాలనీ పీ4 కార్యాలయంలో శుక్రవారం విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు సాయం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినవిధంగా ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు నూనె, కిలో ఉల్లిపాయలు, బంగాళ దుంపలు, కేజీ పంచదార, రూ.3 వేల వంతున ప్రతి కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వేళలో పార్టీలు, రాజకీయాలు పక్కన పెట్టి అందరికీ ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జోన్-5 జెడ్సీ బి.రాము, డిప్యూటీ తహసీల్దారు సువర్ణ, పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక కూటమి పార్టీల నాయకులు హాజరయ్యారు.

విద్యార్థుల అభిరుచులను ప్రోత్సహిస్తే డ్రగ్స్‌కు దూరం

- నార్కోటిక్స్ అదనపు డైరెక్టర్ జనరల్ రవికిరణ్ సూచన



సదస్సులో పాల్గొన్న నార్కోటిక్స్ అదనపు డైరెక్టర్ జనరల్ రవికిరణ్, ఇతర ప్రముఖులు

కంచరపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకు నచ్చే సబ్జెక్టులు చదివేలా, వారి అభిరుచులు పెంపొందించుకునే విధంగా ప్రోత్సాహం అందిస్తే వారు మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాల వైపు మళ్లకుండా ఉంటారని నార్కోటిక్స్ అదనపు డైరెక్టర్ జనరల్ రవికిరణ్ సూచించారు. పిల్లలు, విద్యార్థులలో ఈ పరివర్తన తీసుకురావడంలో తల్లిదండ్రులు, గురువుల పాత్ర కీలకమన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో శుక్రవారం బాల వికాస్ ఫౌండేషన్ సంస్థతో కలిసి నార్కోటిక్స్ విభాగం డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు చేశారు. పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే తత్వం, ప్రశ్నించే అలవాటు పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ మాదక ద్రవ్యాలు, వాటి వినియోగం వల్ల విధించే శిక్షలను విద్యార్థులకు తెలియజేసి అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్ కేఆర్ఎస్ శంకర్, ఎ.శ్రీకాంత్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



సీతమ్మధార కూడలిలో నినదిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

సీతమ్మధార, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సీతమ్మధార కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద రమణ జెండాను ఎగురవేసి మాట్లాడారు. మొదటి కార్మిక సంఘంగా గుర్తింపు పొందిన ఏఐటీయూసీ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పడాల గోవింద్, ఎన్.మధురెడ్డి, వెంకటలక్ష్మి, రావి అశోక్, బోర రమణ, ఆర్‌టీ నాయుడు, దువ్వి బాలు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించారు. జెండాను ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పడాల రమణ ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. స్వాతంత్ర్యానంతరం 26 చట్టాల రూపకల్పనలో ఏఐటీయూసీ పాత్ర కీలకమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మున్సిపల్ ఉద్యోగులకు అనేక హక్కులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో సేవలందించాలి



నేత్ర వైద్యశాలలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి

సీతమ్మధార, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది హక్కులు పొందడంతోపాటు క్రమశిక్షణతో కూడిన సేవలు అందించాలని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి హితవు పలికారు. రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్ ఎదురుగా గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో నవీన్‌కుమార్, బ్రాంచ్ అధ్యక్షుడు పి.తులసీరాం, కార్యదర్శి ఎన్.సౌమ్య, ఎస్.వెంకటరావు, ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.అప్పారావు, జిల్లా కార్యదర్శి మహ్మద్ దురానీ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలి

- జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు



పన్ను బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

అల్లిపురం/డాబాగార్డెన్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను, నీటి చార్జీ బకాయిల వసూళ్లపై రెవెన్యూ సిబ్బంది శ్రద్ధ వహించాలని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు జోన్ పరిధిలోని పలు వార్డుల్లో జడ్సీ శుక్రవారం పర్యటించారు. 33వ వార్డులోని పలు దుకాణదారులు, పన్నులు చెల్లించని గృహయజమానులకు నోటీసులు జారీ చేశారు. అడ్మిన్ కార్యదర్శులు, ఆర్ఐలు వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. ఆర్ఐ సీతారామయ్య, వార్డు అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు. 31వ వార్డులోని ఆస్తి పన్ను మొండి బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా పర్యటిస్తున్నట్టు జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ లక్ష్మీస్ట్రీట్ తదితర ప్రాంతాల్లో చాలా కాలంగా ఆస్తి పన్ను, నీటి చార్జీలు చెల్లించని యజమానుల వివరాలు తెలుసుకుని నోటీసులు జారీ చేశామన్నారు. కొన్నిచోట్ల అక్కడికక్కడే ఆస్తి పన్ను వసూలు చేశామన్నారు. నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బకాయిలు పడకుండా ఎప్పటికప్పుడు పన్నులు చెల్లించాలని పలువురికి సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, వార్డు అడ్మిన్ సెక్రటరీలు రమాదేవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత స్ఫూర్తిప్రదాత సర్దార్ పటేల్



ఐక్యతా దినోత్సవంలో పాల్గొన్న డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకు వాల్తేరు డివిజన్ రైల్వే శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) నిర్వహించింది. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ రాజనీతిజ్ఞుడిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలో ఐక్యత స్ఫూర్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. జాతీయ సమగ్రత, ఐక్యతకు విశేష కృషి చేశారు. ధైర్యవంతుడైన నాయకునిగా గుర్తింపు పొందిన పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. అంతకుముందు సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బందితో జాతీయ ఐక్యతా దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ఐక్యతా వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు ఈ.శాంతారామ్, కె.రామారావు, సీనియర్ డీపీవో కబిర్ అన్సారి, స్పోర్ట్స్ ఆఫీసర్ హరినాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

అక్కయ్యపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన స్థానిక ఎన్‌జీజీవోస్ కాలనీ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌లో ప్రతిభ చూపిన కె.అనూష, కె.దేవి, వై.భావన, డి.వర్షిణి, ఎస్.సిద్ధార్థలను, హ్యాండ్‌బాల్‌లో విజయం సాధించిన కె.లక్ష్మి, శ్రీప్రియలను ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయినులు రత్నం, జ్యోతి పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోండి

- ప్రజలకు జోనల్ మలేరియా అధికారిణి ప్రభావతి సూచన



డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన నీటిలో దోమల లార్వాను పరిశీలిస్తున్న అధికారుల బృందం

సీతంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ బి.ప్రభావతి సూచించారు. 25వ వార్డు పరిధిలోని సీతంపేట, గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో మలేరియా అధికారులు శుక్రవారం పర్యటించి ఇళ్లల్లో నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, కుండీలను పరిశీలించారు. డ్రమ్ముల్లోని నీటి నిల్వల్లో దోమల లార్వాలు పెరుగుతున్నట్లు గుర్తించి వాటిని నివాసితులకు చూపారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. డ్రమ్ములు ఖాళీ చేసి శుభ్రం చేయాలని, నీటిని ఎప్పటికప్పుడు పట్టుకోవాలని పేర్కొన్నారు. జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమర్థంగా డ్రైడే డ్రైడే నిర్వహించి దోమలు వ్యాప్తిచెందకుండా చూడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్ఈవో తిరుపతిరావు, హెల్త్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసరెడ్డి, మహేష్, కిరణ్, ఏఎన్ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు డ్రైడే పాటించండి



32వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ కందుల నాగరాజు, అధికారులు, సిబ్బంది

అల్లిపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణ (సీజనల్) వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా ప్రబలకుండా ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు సూచించారు. శుక్రవారం వార్డులోని నేరళ్లకోనేరు వద్ద ప్రజలకు వ్యాధుల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఏంహెచ్ఓ కృష్ణంరాజు, ఎస్ఎస్ కిషోర్, శానిటరీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు



ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు సభ్యులతో సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలురు, బాలికల విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం ముగిశాయి. సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో జరిగిన ఈ పోటీలకు విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి విలువిద్య క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ ఈవెంట్లలో ఉమ్మడి విశాఖ నుంచి బాలికల విభాగంలో కె.సాయి మనస్వి, పి.హర్షిత, ఎన్.మోక్షిత, తాస్వి, కీర్తి మొదప్రియ, వి.కీర్తిక, వి.ఆద్య...బాలుర విభాగంలో కె.అశ్రిత్ సాయికృష్ణ, డి.గౌతమ్, వి.లలిత్‌సాయి, పూర్వ రాథోడ్, ప్రసాద్‌నాయుడు, మోహిత్‌సాయి, ఎం.మనోజ్‌కుమార్, సంతోష్ ప్రాతినిధ్యం వహిస్తారని ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. జట్టు సభ్యులను సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ తదితరులు అభినందించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి ఎఫ్‌సీఎల్ క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోర్టు అథారిటీ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనున్న ఫ్రెండ్స్ క్రికెట్ లీగ్ టోర్నీకి సంబంధించి జెర్సీని నిర్వాహకులు కరణ్, భార్గవ్ శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శనివారం నుంచి జరగనున్న ఈ టోర్నీలో 12 ఫ్రాంచైజ్ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఇటీవల గోవాలో జరిగిన జట్టు సభ్యుల వేలంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత స్థాయి క్రికెటర్లను వివిధ ఫ్రాంచైజర్లు కొనుగోలు చేసి జట్లను పటిష్టంగా రూపొందించామని పేర్కొన్నారు. శనివారం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనున్న ఈ టోర్నీలో వైజాగ్ బుల్స్, దయారామ్ రాయల్స్, ద ఈగల్ బాయ్స్, సూపర్ టాసెర్స్, బిబి కింగ్స్, హైఫై డైమండ్, స్వాన్ సూపర్ స్ట్రైకర్స్, హెచ్‌సీఏ బ్లాస్టర్స్, సోనా సూపర్‌కింగ్స్, కోచర్, అవెంజర్స్, హై ఫ్లైయర్స్ జట్లు పాల్గొంటాయని వివరించారు.

ఆస్పత్రుల సమ్మె విరమణ

... 5వ పేజీ తరువాయి

విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో సమ్మెను విరమిస్తున్నట్టు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రకటించాయి. రోగుల ఇబ్బందుల దృష్ట్యా నెట్‌వర్క్ హాస్పటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రభుత్వం సంప్రతింపులు చేసి సమ్మె విరమింపజేసిందని జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు.

వైద్యుడి వక్రబుద్ధి

... 5వ పేజీ తరువాయి

పాల్పడుతున్నారని ప్రచారం ఉంది. తన వాంఛలు తీర్చుకునేందుకు ఎవరూ లభించనప్పుడు బయట కాల్‌గర్ల్స్‌ని కూడా బుక్ చేసుకుంటారని, వారిని నగరంలోని స్టార్ హోటళ్లకు తీసుకువెళతారని తెలిసింది. తాజాగా వారం క్రితం ఓ స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేసుకొని ఓ మహిళను తీసుకువెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కీచక వైద్యాధికారిపై విచారణ చేసి, తగిన చర్యలు చేపట్టాలని వైద్య విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.

పెట్టుబడుల సదస్సుకు 3,000 మంది...

... 5వ పేజీ తరువాయి

మైదానంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉపరాష్ట్రపతి నేరుగా ల్యాండ్ అయ్యేలా హెలిప్యాడ్‌లు సిద్ధం చేయాలన్నారు. మంత్రులు, ఇతర ప్రముఖుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, వసతి జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రెండు రోజులపాటు ప్రధాన వేదిక వద్ద ఉంటారని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిరంతరం విద్యుత్ ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజుల సదస్సుకు వచ్చే అతిథులు పర్యాటక ప్రాంతాలు, ఆలయాల సందర్శనకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంటూ ఆయా ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు ముందుగా చేపట్టాలన్నారు. కార్యక్రమాలకు జేసీ మయూర్ అశోక్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఉంటుందని పేర్కొంటూ అక్కడ నుంచి సహాయ సహకారాలు అందుతాయని చెప్పారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారులు

... 5వ పేజీ తరువాయి

కొట్టుకుపోయాయి. వరదకు ఆనందపురం మండలం శొంఠ్యాం-పేకేరు మార్గంలో శిర్లపాలెం వద్ద కల్వర్టు, పెందుర్తి మండలం రాజయ్యపేటలో రోడ్డు కొట్టుకుపోయాయి. శిర్లపాలెం వద్ద కొట్టుకుపోయిన కల్వర్టుకు సుమారు మూడు లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసి, గ్రామాల మధ్య రాకపోకలను పునరుద్ధరించారు. రాజయ్యపేటలో కొట్టుకుపోయిన రోడ్డు మరమ్మతులకు సుమారు రూ.25 లక్షల వరకు నిధులు అవసరమని అంచనా వేశారు. పంచాయతీలో రూ.25 లక్షలు లేకపోతే మండల గ్రాంటు నుంచి నిధులు విడుదల చేయాలని యోచిస్తున్నారు. అలాగే భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం గ్రామంలోకి నీరు ప్రవేశించింది. దీంతో గ్రామస్థులను పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే ఆనందపురం మండలం పొడుగుపాలెం కాలనీలో ఇళ్లలోకి వర్షపునీరు వచ్చే అవకాశం ఉందని ముందుగానే గుర్తించి అక్కడ ప్రజలకు పునరావాస శిబిరానికి తరలించారు. పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో దెబ్బతిన్న రోడ్లు, అప్రోచ్ రోడ్లు, కల్వర్టులు, భవనాల మరమ్మతులకు ఏ మేరకు నిధులు అవసరమవుతాయో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కాగా గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా కాలువల్లో పూడికతీత చేపట్టినట్టు జిల్లా పంచాయతీ అధికారి ఎం.ఎస్.వి. శ్రీనివాసరావు తెలిపారు. మంచినీటి ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేశామన్నారు.

సాయి శ్రేయాస్‌కు మళ్లీ అనుమతులు!

... 5వ పేజీ తరువాయి

అనుగుణంగా కమిటీలో స్థానం కల్పించారు. కానీ ఆ రంగంలో నైపుణ్యం కలిగినవారే కారణాలు గుర్తించగలరనే విషయం విస్మరించారు. దీనినే మానవ హక్కుల వేదిక తప్పుబట్టింది. నలుగురు సభ్యులు కలిగిన ఇన్‌స్పెక్షన్ కమిటీ సెప్టెంబరు ఒకటో తేదీన కంపెనీ ప్రాంగణాన్ని సందర్శించి అన్నీ పరిశీలించింది. ఆ మరుసటిరోజు నివేదిక తయారుచేసి అందించింది.

విషవాయువులు పీల్చడం వల్లనే మరణాలు

ఎఫులియెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో వ్యర్థాలను న్యూట్రలైజేషన్ చేస్తుండగా పరిశీలనకు వెళ్లిన ఇద్దరు భద్రతా ఉద్యోగులు ట్యాంకు మ్యాన్‌హోల్ నుంచి వచ్చిన విషవాయువులు (సల్ఫ్యూరిక్ యాసిడ్, అమోనియా, ఓలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్) పీల్చడం వల్లనే మరణించారని ఇన్‌స్పెక్షన్ అభిప్రాయపడింది.

ఈ సందర్భంగా కంపెనీకి కొన్ని సూచనలు చేసింది.

- కంపెనీలో ఇంకా 80 కిలోలీటర్ల ఎఫులియెంట్ స్టోరేజ్ ట్యాంకులో ఉంది. దానిని వెంటనే బయటకు తరలించాలి.
- ఎఫులియెంట్ స్టోరేజీ ట్యాంక్ ప్రాంతంలో వాయువులను గుర్తించే పరికరాలు ఏర్పాటుచేయాలి.
- ప్రామాణిక ఆపరేషన్ విధానాలు (ఎస్ఓపీ) పాటించాలి.
- న్యూట్రలైజేషన్ ప్రక్రియను జనరల్ షిఫ్ట్‌లోనే నిర్వహించాలి.
- ఎఫులియెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు అనుసంధానం చేసిన స్క్రబ్బర్‌కు ప్రత్యేకంగా విద్యుత్ మీటర్ ఏర్పాటుచేసి, వాటి రీడింగ్ ప్రతి నెలా కాలుష్య నియంత్రణ మండలికి పంపాలి.
- ప్రమాదకరమైన వ్యర్థాలను ఎప్పటికప్పుడు సీఈటీపీకి పంపించాలి.

హెచ్‌ఆర్‌ఎఫ్ అభ్యంతరాలు

జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ లోపాలను బహిర్గతం చేయలేదని హెచ్‌ఆర్ఎఫ్ ఆరోపించింది. కంపెనీలో అంతర్గత భద్రత వైఫల్యాల వల్లే ఈ ప్రమాదం జరిగిందని, దానిని నిర్ధారించలేదని పేర్కొంది. కంపెనీలో స్క్రబ్బింగ్ విధానం లోపభూయిష్టంగా ఉన్నా దానిని తప్పుపట్టలేదని కూడా విశ్లేషించింది. ఈ నివేదిక అశాస్త్రీయంగా, బాధ్యతారాహిత్యంగా ఉందని ఆరోపించింది. నిర్వహణ లోపాలు, భద్రతా వైఫల్యాలు, నియంత్రణ అంశాలను విస్మరించిందని పేర్కొంది. ఇకపై ఏదైనా ప్రమాదం జరిగితే 48 గంటల్లో కమిటీని వేయాలని డిమాండ్ చేసింది. ఈ ప్రమాదాన్ని గుణపాఠంగా తీసుకుని రాష్ట్రంలో యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ ట్రైనింగ్ ప్రవేశపెట్టాలని సూచించింది.



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెర్రిపోతుల ముత్యాలు

ఇందిరాగాంధీకి నివాళి

గాజువాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రిగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని ఏపీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గాజువాకలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతి కోసం ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలు ఎంతో సాహసోపేతమైనవని పేర్కొన్నారు. నాటి నిర్ణయాలే నేడు దేశ ప్రగతికి మూల కారణమన్నారు.

వార్డుల్లో కార్పొరేటర్ల పర్యటన

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) :మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల్లో ముంపునకు గురైన 68వ వార్డులోని పలు కాలనీలను కార్పొరేటర్ గుడివాడ అనూష శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కిరెడ్డిపాలెం, రామ్‌నగర్, అప్పన్నకాలనీ, మింది కాలనీల్లో దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను, చెత్తను త్వరగా తొలిగించి, రహదారులకు మరమ్మతులు చేయాలని కార్పొరేటర్ సిబ్బందికి సూచించారు.

కొండవాలు ప్రాంతాల్లో ...

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు జైంద్రకాలనీ కొండవాలు ప్రాంతంలో కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) శుక్రవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన రిటైనింగ్ వాల్ పనులను అధికారులతో మాట్లాడి ప్రారంభం చేయించారు. అదేవిధంగా చింతలలోవలో వర్షాల కారణంగా కొండవాలు ప్రాంతంలో తరచూ మట్టిపెళ్లలు, రాళ్లు జారిపోవడంతో, త్వరలో ఆ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టేలా తనవంతు కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు జెర్రిపోతుల నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



దుర్గమాంబ

అగనంపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య ఎస్.వి.సి.లిలిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** సౌజన్య(గోపాలపట్నం), ,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు)50, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు 38, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోసకాయలు 38, పొటల్స్ 58, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది)40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 52, కంద దుంప 46, ముల్లంగి 30, గోరుచిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెదకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240



తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, పక్కన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, టీడీపీ నియోజవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ, తదితరులు



సరుకులు, నగదు అందుకున్న తుఫాన్ బాధితులతో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

బాధితులకు అండగా ఉంటాం

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు
- నిత్యావసర సరుకులు పంపిణీ

పెందుర్తి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన సాయంతో జిల్లాలో వేలాది మందికి లబ్ధి జరగనున్నదని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పెందుర్తిలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య కేంద్రంలో వరద బాధితులు ఏకలవ్య కాలనీవాసులకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సమర్థతతోనే తుఫాన్ తీవ్రతను నియంత్రించామని పేర్కొన్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా మోనిటరింగ్ చేసి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయం చేయడంతో నష్టాన్ని బాగా తగ్గించామని వెల్లడించారు. విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకుని, పనిచేసే ప్రభుత్వం తమదన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. తుఫాన్ తీరం దాటిన ఒక్కరోజులోనే పెందుర్తి ప్రాంతాన్ని యథాస్థితికి తీసుకువచ్చామని వివరించారు.అనంతరం ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, నగర్ మేయర్ పీలా శ్రీనివాసరావు హాజరై 27 కుటుంబాలకు నిత్యావసర సరకులు, ప్రభుత్వం ప్రకటించిన నగదు రూ.72 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట అప్పారావు, జడ్పీ శంకరరావు, పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, జనసేన నాయకుడు సేనాపతి సోమశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడానికి సీఎం ఎంతో శ్రమిస్తున్నారు : ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం : మొంథా తుఫాను బాధితులను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయాన్ని గోపాలపట్నం టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన 89, 90, 91, 92 వార్డులకు సంబంధించి 40 మంది బాధిత కుటుంబాలకు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం నిరంతర పోరాటం

- ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాల్లో పలువురు కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ అన్నారు. ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాలు శుక్రవారం ప్లాంట్ ప్రధాన గేటు వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. కానీ ప్రభుత్వ రంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేసి కార్పొరేట్‌లకు అప్పగించేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. కార్యాక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశంలోనే తొలికార్మిక సంఘం

పెదగంట్యాడ : దేశంలోనే తొలి కార్మిక సంఘంగా ఆవిర్భవించిన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి ఏజే స్టాలిన్ అన్నారు. గాజువాక నియోజకవర్గం సీపీఐ, ఏఐటీయూసీలు సంయుక్తంగా శుక్రవారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్స వాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ సర్కార్ 44 కార్మిక చట్టాలను, 4 కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. భారీ పరిశ్రమలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే వారే దేశ ఆర్థిక వ్యవస్థను శాసించగలుగుతారన్నారు. ఇది దేశ సార్వభౌమత్వానికే ప్రమాదం తెచ్చి పెట్టే పరిణామన్నారు. ఈ కార్యక్రమం స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం : కార్మికుల సమస్యలతో పాటు ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు ఉద్యమాలు చేపట్టి విజయం సాధించిన ఘనత ఏఐటీ యూసీకే దక్కుతుందని భెల్ హెచ్‌పీవీసీ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బొండా బాబూరావు అన్నారు. భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాల్లో సీనియర్ కార్యకర్త ఎస్ గోవిందరావు పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భెల్ హెచ్‌పీవీపీలో సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమలో ఏఐటీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉక్కుటౌన్‌షిప్: ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న డి.ఆదినారాయణ



పెదగంట్యాడలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏజే.స్టాలిన్



మద్దిలపాలెం : పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి



కూర్మన్నపాలెంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీని ప్రారంభిస్తున్న సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు



పెందుర్తిలో జరిగిన రాష్ట్రీ ఏక్తా దివస్ ర్యాలీలో పాల్గొన్న సీఐ సతీశ్‌కుమార్, సిబ్బంది

వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో పనిచేద్దాం

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

మద్దిలపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని, స్వర్గీయ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో పోలీస్ సిబ్బంది పనిచేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. రేంజ్ పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవంలో ఆయన పాల్గొని వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ స్వాతంత్య్రం అనంతరం దేశంలోని అనేక రాచరిక రాష్ట్రాలను భారత యూనియన్‌లో విలీనం చేయడానికి పటేల్ పోషించిన కీలక పాత్ర దేశ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. దేశ సమైక్యత, ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు పటేల్ అని కొనియాడారు. భారతదేశ తొలి ఉప ప్రధాని, హోంమంత్రిగా ఎన్నో సేవలు అందించారన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు అంకిత భావంతో పనిచేయాలని పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యాలయం మేనేజర్ బాలాసూర్యారావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మల్కాపురంలో..

మల్కాపురం : సర్దార్ వల్లభాయ్ పటేల్ కలలు కన్న భారతావని ఐక్యతతోనే సాధ్యమని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు అన్నారు. పోలీసుస్టేషన్ ఆవరణలో జరిగిన పటేల్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. పటేల్ గొప్ప నాయకుడు అని, భారతీయులంతా ఐక్యతతో ఉండాలన్నదే ఆయన ధ్యేయమని తెలిపారు. శ్రీహరిపురం స్వామి వివేకానంద స్కూల్‌లో కూడా పటేల్ జయంతి నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మల్కాపురం పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో కూడా పటేల్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఐపీఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పటేల్ భారతదేశ మొదటి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా పనిచేశారని, ఆయన నాయకత్వం గర్వించదగినదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సీనియర్ అధికారి అనసూయదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో..

గోపాలపట్నం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ లెంక సన్యాశినాయుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడంతో పాటు స్వరాజ్య ఏకీకరణ చేసి దేశ సార్వభౌమత్వం, ఐక్యతకు పునాదులు వేసిన వ్యక్తి వల్లభాయ్ పటేల్ అన్నారు. అనంతరం ఆయన పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఐక్యతా ప్రతిజ్ఞ చేసి, స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, ఏఎస్ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తిలో...

పెందుర్తి : వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని పెందుర్తి పోలీసులు రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి నుంచి చినముషిడివాడ వరకు 2కే రన్ నిర్వహించారు. అనంతరం సీఐ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో దేశ సమైక్యతా స్ఫూర్తి నింపాలన్న ఉద్దేశంతో రన్ ఫర్ యూనిటీ నిర్వహించామన్నారు. అంతకుముందు స్టేషన్‌లో ఆవరణలో సీఐ మొక్కలు నాటారు, పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కూర్మన్నపాలెంలో...

కూర్మన్నపాలెం : దేశ సమైక్యత, భద్రత కోసం పటేల్ చేసిన త్యాగాలు మరువలేనివని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం సౌత్ పరిధిలోని పోలీసులు పటేల్ జయంతి సందర్భంగా రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో సంస్థానాల విలీనానికి పటేల్ ఎంతో కృషి చేశారన్నారు. కాగా ర్యాలీ కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంటు వరకూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో దువ్వాడ, స్టీల్‌ప్లాంటు సీఐలు కె.మల్లేశ్వరరావు, కేశవరావు, సౌత్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి పోలీస్ టీమ్ ఆధ్వర్యంలో...

సింధియా : పటేల్ జయంతి సందర్భంగా హార్బర్ సబ్ డివిజన్ ఏసీపీ కాళిదాస్ ఆదేశాల మేరకు డివిజన్‌లోని మహిళా శక్తి పోలీస్ టీం వన్ టౌన్, హార్బర్, మల్కాపురం, న్యూపోర్టు పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవం గురించి పటేల్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అలాగే శక్తి యాప్ ఉపయోగాలను తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో మహిళా ఎస్ఐ బి. ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురం పోలీసుస్టేషన్‌లో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ అప్పారావు



సింధియా : కార్యక్రమంలో పాల్గొన్న హార్బర్ సబ్ డివిజన్ శక్తి టీమ్ సభ్యులు

విజిలెన్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఏకే బాగ్చీ

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రతి ఒక్కరూ మార్గదర్శకులుగా, బాధ్యతాయుతంగా జీవించాలని సీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఏకే.బాగ్చీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్, క్రీడా విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రత, పారదర్శకత, నైతిక విలువల గూరించి వివరించారు. అవినీతి రహిత సమాజంతో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. అందరూ పనిని బాధ్యతగా భావించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

- మలేరియా విభాగం అధికారులు

అగనంపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో శుక్రవారం పరిసరాల పరిశుభ్రతపై మలేరియా విభాగం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు, చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. జీవీఎంసీ చెత్త సేకరణ వాహనాలకు ఎప్పటికప్పుడు తడి చెత్త పొడి చెత్త విడివిడిగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ తొలగింపు

కూర్మన్నపాలెం,అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు సిద్ధార్థ నగర్‌లో శిథిలస్థితిలో ఉన్న వాటర్ ట్యాంక్ తొలగింపు పనులను శుక్రవారం ప్రారంభించారు.ఈ పనులను రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్యాంకు తొలగింపు పనుల్లో స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కాంట్రాక్టర్లకు సలహాలిచ్చారు. ఇంతకముందు వడ్లపూడి ఆర్యవైశ్య సామాజిక భవనంలో నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చా వేదిక 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ ప్రాంతంలో నిర్మించనున్న స్పోర్ట్స్ కాంపెక్స్ గురించి అధికారుల ముందు ప్రస్తావన వచ్చిందన్నారు. అందులో భాగంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు నిధులు మంజూరు చేశారని తెలిపారు. త్వరగా ఈ పనులను పూర్తి చేసి వార్డు ప్రజలకు ఈ కాంప్లెక్స్‌ను అంకితం చేస్తామని జగన్ తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పనితీరు జరుగుతోందన్నారు.

'సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ వద్దు'

పెదగంట్యాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలకు సమీపంలో అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు చేయవద్దని జేఏసీ సభ్యులు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ గ్రైండిగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా కాలుష్యకారకంగా మారుతుందని అందుకు దీన్ని వ్యతిరేకించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఏకధాటి బాబా నామ జపం

అగనంపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో ఏర్పాటు చేసిన ఏకధాటి సాయి నామ జపం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా సాయినాథుడిని ప్రత్యేక వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి 24 గంటల పాటు ఏకధాటిగా సాయినామాన్ని జపించారు.

ఘనంగా ఆళ్వార్‌దాస్ జయంతి



ఆళ్వార్‌దాస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

వేపగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం దరి ఆర్ఆర్‌వీ పురం లో ఉన్న ఆళ్వార్ విద్యా సంస్థల క్యాంపస్‌లో ఆళ్వార్ దాస్ 95వ జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు ఆళ్వార్‌దాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్యాంపస్ కోఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో విద్యా సంస్థలు స్థాపించి, విద్యాభివృద్ధికి ఆళ్వార్ దాస్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు సీహెచ్ రాజు, బి. హేమ చంద్రరావు, యు. గోపి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

పెందుర్తి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలోని వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. తరువాత పవిత్ర విసర్జన చేసి, పూజలు చేశారు. కాగా శనివారం కార్తీక ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలంనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంతోష్‌నగర్, ఖారవేలనగర్, గణేశ్‌నగర్, చంద్రనగర్, భగత్‌సింగ్‌నగర్, తుంపాల వీధి, వైఎస్సార్ నగర్, ఆదర్శనగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

వేపగుంట : విరాట్‌నగర్, సింహాద్రినగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈమేరకు సింహాద్రినగర్, బొబ్బిలివారి వీధి, దత్తసాయినగర్ పరిసర ప్రాంతాలకు సరఫరా ఉండదని ఆ శాఖాధికారులు తెలిపారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన

కూర్మన్నపాలెం,అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో మొక్కల పెరుగుదల బాగుంటుందని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జి. విశ్వేశ్వరరావు, ఎం. పరమానందం అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం కాలనీలోని మొక్కలకు సేంద్రియ ఎరువులను సరఫరా చేశారు. మొక్కలను సొంత పిల్లలా పెంచాలని అన్నారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాల్లో భాగంగా కమ్యూనిటీ కంపోస్టు, రెయిన్ హార్వెస్టింగ్ పిట్స్‌ను అభివృద్ధి చేస్తున్న ఘనత తిరుమల నగర్ కాలనీ వాసులకే దక్కుతుందన్నారు. కాలనీలో ఖాళీ స్థలాల్లో ఆ యజమానులతో మాట్లాడి సేంద్రియ ఎకువులతో ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు.

ఒరిగిన ధ్వజ స్తంభం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు వెంకటేశ్వర కాలనీలోని లలితాంబిక ఆలయంలో ధ్వజస్తంభం ఒక వైపునకు ఒరిగింది. ఈ ధ్వజస్తంభం కొద్దికొద్దిగా ఒరుగుతోంది. దీంతో అది పూర్తిగా ఒరిగిపోకుండా ఉండేందుకు ఆలయ కమిటీ సభ్యులు తాళ్లతో కట్టారు. త్వరలోనే ధ్వజారోహణ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన గంటా రవితేజ



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో గంటా రవితేజ కుటుంబం

భీమునిపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను శుక్రవారం మంగళగిరిలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ కుటుంబ సమేతంగా కలిశారు. భీమిలి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్తగా మంజూరైన ప్రాజెక్టుల వివరాలను వివరించారు. భీమిలి అభివృద్ధికి సహకరిస్తానని ఈ సందర్భంగా పవన్ హామీ ఇచ్చారు. రవితేజ చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత విస్తృత పరచాలని సూచించారు. రవితేజతో పాటు అతని సతీమణి, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి, కుమారుడు ఆర్యన్ పవన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

యూపీఎస్సీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

» అధికారులకు జేసీ మయూర్ అశోక్ ఆదేశం



పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న జరగున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్ట రేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన సమీక్షిం చారు. జిల్లాలోని 7 కేంద్రాలలో 3,268 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించే ఈ పరీక్షలలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల వారు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముగ్గురు రూట్ అధికారులను, ఏడుగురు తనిఖీ అధికారులను జేసీ నియమించారు.

ఆర్టీసీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని ఏడు డిపోల్లో ఖాళీగా ఉన్న డ్రైవర్, శ్రామిక్, మెకానిక్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల 570 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన దృష్ట్యా 105 పోస్టులు ఖాళీ అయ్యాయన్నారు. మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, మద్దిలపాలెం, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం డిపోల్లో డ్రైవర్ 40, శ్రామిక్ 40, మెకానిక్ 25 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డ్రైవర్ పోస్టుకు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి, 18 నెలల సర్వీసు ఉండాలన్నారు. మెకానిక్‌లకు డీజిల్ మెకానిక్ విభాగంలో ఐటీఐ, శ్రామిక్‌లు ఏదో ఒక ట్రేడులో ఐటీఐ పూర్తిచేసి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గలవారు తమకు దగ్గరలోని డిపోలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పలు సంస్థలతో షిప్‌యార్డు ఎంవోయూలు



ఇండియన్ మారీటైమ్ వీక్‌లో పాల్గొన్న షిప్‌యార్డు అధికారులు

మల్కాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ముంబైలో ఈనెల 27 నుంచి 31 వరకు జరిగిన ఇండియన్ మారీటైమ్ వీక్ 2025లో హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) మినీ రత్న హోదాలో పాల్గొని పలు ఒప్పందాలను చేసుకుంది. గ్రీన్ టెక్నాలజీ, నౌక మరమ్మతులు, డిజైన్ భాగస్వామ్యం, నౌకా నిర్మాణంలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి భారతీయ, అంతర్జాతీయ సంస్థలతో జత కలిసింది. భారత ప్రభుత్వ గ్రీన్‌టగ్ ట్రాన్సిషన్ ప్రోగ్రామ్ కింద హైడ్రోజన్ టగ్‌ల అభివృద్ధికి ఇండియన్ పోర్ట్సు అసోసియేషన్, షిప్‌యార్డులో డీసీఐ డాకింగ్, మరమ్మతుల కోసం డ్రెజ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో, భారతదేశం, కొరియా, తదితర ప్రముఖ భాగస్వాములతో వ్యూహాత్మక సహకారంతో పాటు పలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసింది. కార్యక్రమంలో షిప్‌యార్డు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కైలాసగిరిని సందర్శించిన కలెక్టర్

విశాలాక్షినగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 14,15వ తేదీల్లో నిర్వహించే భాగస్వామ్య సదస్సులో భాగంగా కైలాసగిరిలో గ్రీనరీ అభివృద్ధి పనులతో పాటు పరిసరాలను జిల్లా కలెక్టర్, వీఎంఆర్డీఏ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. భాగస్వామ్య సదస్సులో పాల్గొనే వారు కైలాసగిరి సందర్శించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసే అవకాశాలను ఆయన పరిశీలించారు. తెలుగు మ్యూజియంను సందర్శించి, దాంతో పాటు చుట్టు పక్కల గ్రీనరీ అభివృద్ధి పనులను సత్వరం పూర్తిచేయాలన్నారు. దుకాణదారులు డస్ట్‌బిన్‌లలో చెత్తచెదారాలను వేయాలని సూచించారు. కైలాసగిరి ప్రాంతాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ భల్లాకు గౌరవ వందనం



గౌరవ వందనం స్వీకరిస్తున్న సంజయ్ భల్లా

» నేవీ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా బాధ్యతల స్వీకరణ

నేవీ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా సంజయ్‌భల్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అతనికి నేవీ సిబ్బంది గౌరవ వందనం చేశారు.



నేవీ కమాండింగ్ ఇన్ చీఫ్‌ను పరేడ్‌కు తోడ్కొని వస్తున్న దృశ్యం

పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు

» ఘనంగా ఉక్కు మనిషి సర్దార్ జయంతి



పటేల్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

సిరిపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలకు పునరంకితం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పిలుపునిచ్చారు. పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం వాల్తేరు క్లబ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కుమనిషిగా కీర్తిగడించి, ప్రజలందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి పటేల్ అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలోనే కాకుండా, దేశ ప్రజల ఐక్యతకు పాటుపడిన గొప్ప వ్యక్తి అని అభిలషించారు. దేశ ప్రజల సంక్షేమం కోసం సాంఘిక ఉద్యమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఆయన చిరకాలం ప్రజల గుండెల్లో నిలువాలనే ఉద్దేశంతోనే పటేల్ జయంతిని ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.కార్యక్రమంలో పార్టీ నేతలు సుజాత రాజ్, నాగేంద్ర, ప్రకాశ్‌రెడ్డి, చక్రవర్తి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పటేల్ ఆదర్శనీయుడు: సీపీ

మహారాణిపేట: దేశ ఐక్యత కోసం కృషిచేసిన మహనీయుడు సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ అని, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించారు. సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనా నుంచి గవర్నర్ బంగ్లా వద్ద ఉన్న సర్దార్ పటేల్ విగ్రహం వరకు 'రన్ ఫర్ యూనిటీ' (ఐక్యత కోసం పరుగు) ర్యాలీ నిర్వహించారు. అనంతరం పటేల్ విగ్రహా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో దేశ ఐక్య తకు, అంతర్గత భద్రతకు కట్టుబడి ఉం టామని ప్రమాణం చేయించారు.

హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ

బీచ్ రోడ్డు: ఉద్యోగులు ఐకమత్యంతో సాగితేనే సంస్థకు మంచి ఫలితాలు వస్తాయని హిందుస్థాన్ షిప్‌యార్డు డైరెక్టర్ (కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్) రాకేష్ ప్రసాద్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్‌రోడ్డులో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. పటేల్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పార్కు హోటల్ నుంచి ఆర్కే బీచ్ కాళికామాత ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్‌యార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సందీప్ పరీజా, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి: జడ్పీ సీఈవో

మహారాణిపేట: సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్‌లో ఏక్తా దివస్ నిర్వహించారు. సీఈవో పి.నారాయణమూర్తి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యోగులు సమన్వయం, అంకితభావంతో పనిచేస్తే దేశ సమైక్యతకు బలమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఉద్యోగుల ఐక్యతా ర్యాలీ



పటేల్‌కు నివాళి అర్పిస్తున్న జడ్పీ సీఈవో, ఉద్యోగులు



ఐక్యతా ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

బెంగళూరు, కటక్, సంబల్‌పూర్‌లకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా సంబల్‌పూర్, బెంగళూరు క్యాంట్, కటక్‌ల మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైళ్లు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

సంబల్‌పూర్-బెంగళూరు-సంబల్‌పూర్: 08335 నంబరు గల రైలు నవంబరు 20న ఉదయం 6.30 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.28 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08336 నంబరు గల రైలు నవంబరు 24న ఉదయం 5.30 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2 కు దువ్వాడ, మధ్యాహ్నం 12 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

కటక్-బెంగళూరు-కటక్: 08445 నంబరు గల రైలు నవంబరు 21న ఉదయం 5 గంటలకు కటక్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.28 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08446 నంబరు గల రైలు నవంబరు 25న ఉదయం 5.30 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2 గంటలకు దువ్వాడ, ఉదయం 11.30 గంటలకు కటక్ చేరుతుంది.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

» వార్షికోత్సవంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ



జెండా ఆవిష్కరిస్తున్న రమణ

సిరిపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పక్షాన నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ అన్నారు. ఏఐటీయూసీ 105వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మికులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం ఆవిర్భావం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సమరశీల పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఎల్ఐసీ వంటి సంస్థల్లోని ప్రజా ధనాన్ని అదానీకి దోచిపెడుతోందన్నారు.ఈ చర్యలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. కోట సత్తిబాబు, ఆనద్, రాము, కృష్ణారావు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలిక మృతదేహం లభ్యం



ధనుశ్రీ మృతదేహం


పద్మనాభం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం గెడ్డలో బాలిక గల్లంతైన బాలిక మృతదేహం శుక్రవారం లభ్యమయ్యింది. గ్రామానికి చెందిన కాళ్ల శ్రీనివాసరావు, గౌరిల కుమార్తె ధనుశ్రీ (12) కాజువే వద్దకు దుస్తులు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు గెడ్డలో పడి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలించినా ఫలించలేదు. శుక్రవారం ఉదయానికి బాలిక మృతదేహం నీటిలో తేలియాడడంతో బయటకు తీశారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలిక తల్లి గౌరి గుండెలవిసేలా రోదించింది. సీఐ సీహెచ్ శ్రీధర్ ఘటనా స్థలానికి భీమిలిప్రభుత్వాసుపత్రి వైద్యులను రప్పించి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. పలువురు నాయకులు బాలిక మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. తహసీల్దారు ప్రాథమిక నివేదిక ఉన్నతాధికారులకు పంపారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 22 వినతులు

వెంకోజీపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 22 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీకరించిన వినతులను/ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు టౌన్ ప్లానింగు అధికారులు కృషి చేయాలని, ఫిర్యాదుదారునికి తెలియపరచాలని ఆదేశించారు.

నిండుకుండలా ఏలేరు జలాశయం

విశాఖకు 175 క్యూసెక్కుల నీరు విడుదల



పూర్తిస్థాయి నీటితో కళకళలాడుతున్న ఏలేరు జలాశయం

ఏలేశ్వరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు జలాశయం నుంచి 6 వేల క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేశారు. వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాల కు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రాజెక్టుకు 6,175 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో నిల్వలు పెరుగుతున్నాయి. శుక్రవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.71 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.38 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కులు, దిగువ ప్రాంతాలకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

స్టీల్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి పాటల పోటీలు రేపు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ స్టీల్‌క్లబ్‌లో ఆదివారం రాష్ట స్థాయి పాటల పోటీలు జరుగుతాయని స్టీల్‌క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందిస్తామని ఆయన వివరించారు.

జీఎస్టీ 2.0తో పేదలకు ఊరట

బీచ్ రోడ్డులో విజిలెన్స్ అవగాహన ర్యాలీ



బీచ్‌రోడ్డులో విజిలెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బీచ్ రోడ్డు, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ఉపశమనం కలిగిందని విజిలెన్స్ చీఫ్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ అండ్ ఇన్‌డైరెక్టు టాక్సెస్ సంజయ్ రాతి పేర్కొన్నారు. జీఎస్టీ విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా అవినీతిని అరికట్టడంలో ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో చిన్నతనంలోనే పలువురు దారి తప్పుతున్నారన్నారు. జీఎస్టీ తగ్గింపులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. పన్నులు తగ్గడంతో గృహ వస్తువులనుంచి నిర్మాణ సామగ్రి వరకు ధరలు తగ్గాయన్నారు. ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ అండ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ పి.ఆనంద్‌కుమార్ వస్తువులపై ఎంత వరకు ధరలు తగ్గాయో ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు. ఉద్యోగులు అంకితభావంతో శ్రమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. అనంతరం పార్కు హోటల్ నుంచి ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ సిబ్బంది, పీఆర్వో ఎం.ఎస్.రావు, తదితరులు పాల్గొన్నారు.